# 1. గంగాశంతనుల కథ

## I. ప్రతిపదార్థాలు :

1. గంగ నిజాంగదీప్తు లెసఁగం జనుదెంచి లతాంగి సంతతో
త్తుంగ పయోధరద్వితయ తోయరుహాయతచారునేత్ర , ది
వ్యాంగనయై , ప్రతీపవసుధాధిపు శాలవిశాలదక్షిణో
త్సంగమునందు మన్మథవశంబున నుండె గరంబు లీలతోన్

**పరిచయం** ఈ పద్యం ఆదికవి నన్నయ రచించిన ఆంధ్రమహా భారతం, ఆదిపర్వం, చతుర్థాశ్వాసం నుండి గ్రహించబడిన గంగా శంతనులకథ అనే పాఠం లోనిది . గంగాదేవి ప్రతీపుని మీద వ్యామోహంతోటి భూలోకానికి వచ్చిన సందర్భాన్ని కవి ఇలా వర్ణిస్తున్నాడు .

**ప్రతిపదార్థం :** లత+అంగి=తీగె లాంటి సన్నని శరీరం గలది; సంతత=ఎడతెగకుండా; ఉత్తుంగ =ఎగిసి పడుతున్న; పయః+ ధర= స్తనాల ; ద్వితయ =జంట కలిగినది; తోయరుహ=పద్మం లా; ఆయత=విశాలమైన ; చారునేత్ర =అందమైనకన్నులు గలది(అయిన); గంగ=గంగాదేవి ; నిజ+అంగ=తన శరీర; దీప్తులు =కాంతులు; ఎసగన్=అతిశయిస్తుండగా ; దివ్య +అంగన+ఐ=ఒక దివ్య స్త్రీరూపం దాల్చి (వచ్చి ); ప్రతీప =ప్రతీపుడనే పేరుగల; వసుధ+అధిపు=మహారాజు యొక్క ; శాల=భవనం లాగా ; విశాల=విశాలమైన ; దక్షిణ =కుడి; ఉత్సంగము+అందు=తొడ మీద; మన్మథ వశంబున= కామవాంఛా పరవశురాలై ; కరంబు= మిక్కిలి ; లీలతోన్ = విలాసంగా, ఉండెన్ =కూచొని ఉండెను

**తాత్పర్యం :** తీగె లాంటి సన్నని నడుముకలిగినది; నిరంతరం ఎగసిపడుతున్న స్తనద్వయం కలది, పద్మం లాంటి విశాలమైన , అందమైన కన్నులు కలిగినది ఐన గంగాదేవి తన దేహ కాంతులు అతిశయిస్తుండగా వచ్చి , ప్రతీపమహరాజు యొక్క భవనంలా విశాలమైన కుడితొడ మీద కామవాంఛాపరవశయై కూచున్నదని భావం.

**వ్యాకరణాంశాలు :**

**సంధులు**

నిజ+అంగ=నిజాంగ, లత+అంగి=లతాంగి, రుహ+ఆయత=రుహాయత, దివ్య +అంగన =దివ్యాంగన → , వసుధ+ఆధిప=వసుధాధిప సవర్ణదీర్ఘసంధి

సంతత+ఉత్తుంగ =సంతతోత్తుంగ → , గుణసంధి

దీప్తులు +ఎసగన్=దీప్తులెసగన్ → ఉత్వసంధి

ఎసగన్+చనుదెంచి= ఎసగం జనుదెంచి, ఉండెన్ +కరంబు= ఉండెఁ గరంబు

సరలాదేశాసంధి →

**సమాసాలు**

నిజాంగదీప్తులు =నిజాంగం యొక్క దీప్తులు , మన్మథవశము=మన్మథుని → యొక్క వశము, వసుధాధిపుడు=వసుధకుఅధిపుడు షష్ఠీతత్పురుషసమాసము

లతాంగి= లత లాంటి అంగములుకలది, చారునేత్ర =చారు (అందమైన)నేత్రములు కలది, ఉత్తుంగపయోధర =ఉత్తుంగమైన పయోధరములుకలది → బహువ్రీహి

దివ్యాంగన =దివ్యజాతిదైన అంగన

దక్షిణోత్సంగము =దక్షిణము దైన ఉత్సంగము

విశేషణపూర్వపదకర్మధారాయసమాసము

ప్రదీపవసుధాధిపుడు =ప్రదీపుడు అనే పేరుగలవసుధాధిపుడు

సంభావనాపూర్వపద కర్మధారయ సమాసము

**2. తనుమధ్య దా నొక్క కన్యక సురనదీతటమునన్నుఁ**
**గనినసనక్కన్యక ‹ జూచి నీ విట్టి కమనీయరూప**
**వొనరనా సుతునకుభార్య వగుమన్న నొడఁ బడియియ్య**
**కొనియె ‹ గావుననుదానిని వివాహమగుమయ్యె యమున**

**పరిచయం॥** ప్రతీపుడు గంగను పెళ్ళాడమని తన కొడుకైన శంతనునితో ఇలాచెబుతున్నాడు .

**ప్రతిపదార్థం :** తనుమధ్య =సన్నని నడుముగలది; తాను=తను; ఒక్క =ఒక; కన్యక =కన్నె ; సురనదీ= దేవనది ఐన గంగ; తటమున=తీరంలో; నన్నున్ = నన్ను ; కనిన=చూడగా( నన్ను పెళ్ళాడమని కోరగా ); ఆ+కన్యకన్ =ఆ కన్నెను ; చూచి= చూసి; ఇట్టి =ఇలాంటి; కమనీయ=మనోహరమైన ; రూపవు=రూపం గల; నీవు =నువ్వు ; నా సుతునకు=నా కుమారునికి; భార్యవు =భార్యవుగా ; అగుము=కమ్ము ; అన్నన్ =అని అనగా; ఒడన్+పడి+ఇయ్యకొనియె = ఒప్పుకున్నది ; కావునను= కాబట్టి ; దానిని =ఆ కన్నెను ; నెయ్యమున =స్నేహభావం తోటి ; వివాహము=పెళ్లి ; అగుము=చేసుకొనుము

**తాత్పర్యం :** కుమారా! ఒక అందమైన అమ్మాయి నన్ను దేవనది ఐనగంగాతీరంలో కలసి పెళ్ళాడమని కోరింది . నేను ఆమెను చూసి "నీవు, ఇంతఅందమైన దానివి నా కుమారుని పెళ్ళాడుపో " అని చెప్పగా విని అంగీకరించింది. కాబట్టి నీవు ఆ కన్నెను స్నేహభావం తోటి వివాహం చేసుకో అనిభావం.

**వ్యాకరణాంశాలు :**

**సంధులు**

తాను+ఒక్క =తా నొక్క , నీవు+ఇట్టి = నీ విట్టి , రూపవు+ఒనర= రూపవొనర, భార్యవు +అగుము+అన్న = భార్య వగు మన్న, వివాహము+అగుము=వివాహమగుము ⟶ ఉత్వసంధి

నన్నున్ +గనిన=నన్నుఁ గనిన, అక్కన్యకన్ +జూచి=అక్కన్యకఁ జూచి, ఒడన్+పడి=ఒడఁబడి, ఇయ్యకొనియెన్ +కావున =ఇయ్యకొనియెఁ గావున ⟶ సరళాదేశసంధి

ఆ+కన్యకన్ =అక్కన్యకన్ ⟶ త్రికసంధి

**సమాసాలు**

తనుమధ్య =తనువైన మధ్యముకలది , కమనీయరూప=కమ

నీయమైన రూపముకలది ——→ బహువ్రీహి సమాసము
సురనది= సురలయొక్క నది, నదీతటము = నది యొక్క తటము నా
సుతుడు = నా యొక్క సుతుడు
షష్ఠీతత్పురుషసమాసము

**3. కని వనకన్యయో ! దనుజకన్యయో ! భుజగేంద్రకన్యయో ! యనిమిషకన్యయో ! యిది వియచ్చరకన్యయో ! యపూర్వమీ**

**<u>పరిచయం</u>:** శంతనుడు గంగాతీరంలో గంగను చూసిన సందర్భాన్ని కవి ఇలా వర్ణించాడు .

**<u>ప్రతిపదార్థం</u> :** ఆ+అనఘుడు = ఆ పుణ్యాత్ముడైన శంతనుడు కని=(గంగాదేవిని )చూసి; ఇది=ఎదురుగా ఉన్న ఈ కన్య ; వన కన్య +ఓ=వనదేవతో ; దనుజ కన్య +ఓ= రాక్షసస్త్రీయో ; భుజగ +
ఇంద్ర ,కన్య +ఓ=నాగకన్యయో ;అనిమిష,కన్య +ఓ=దేవకన్య యో ;
వియచ్చర ,కన్య +ఓ=వియచ్చరకన్యయో ;అపూర్వం =అద్భుతం; ఈ వనమునకు=ఈ అడవికి; ఇట్లు =ఈ విధంగా; మానవ కన్య =మానవజాతికన్య ; ఏకతము+ అ=ఒంటరిగా; వచ్చును+ ఏ=వస్తుందా ?; అంచు= అనుకొని; దానిన్ =ఆ కన్నెను ; ఆదట +పోవక = తనివితీరక; ప్రీతితోన్ = ఇష్టంగా ; చూచెన్ =చూశాడు.

**<u>తాత్పర్యం</u> :** గంగాతీరానికి పోయిన శంతనుడు ఎదురుగా కన బడుతున్న కన్యను చూసి, ఈ కన్నె వనదేవతో , రాక్షసస్త్రీయో , నాగకన్యయో , దేవకన్యయో , వియచ్చర కన్యయో అయ్యుండాలి . ఇది అద్భుతం. ఒక మానవ జాతికన్య ఇలా అడవిలోకి రాగలుగుతుందా? అని ఆమె అందానికి ఆశ్చర్యపోయి తనివి తీరక ఇష్టంగా చూశాడని భావం.

**<u>వ్యాకరణాంశాలు</u> :**

**సంధులు:** భుజగ+ఇంద్ర =భుజగేంద్ర ⟶ గుణసంధి
అపూర్వము+ఈ=అపూర్వమీ ,వనమునకు+ఇట్టులు +ఏకతము=వనమున కిట్టు లేకతము ⟶ ఉత్వసంధి
ఆ+అనఘుడు=అయ్యనఘుడు ⟶ త్రికసంధి
దానిన్ +చిత్తమున =దాని‹ జిత్తమున , పోవకన్ +చూచెన్ +బ్రీతి తోన్ ⟶ పోవక‹ జూచె‹ బ్రీతితోన్ సరళాదేశసంధి
ఆదట+పోవక=ఆదటవోవక ⟶ గసడదవాదేశసంధి

**సమాసాలు**

వనకన్య =వనము యొక్క కన్య , దనుజకన్య =దనుజులయొక్క కన్య , భుజగేంద్రకన్య =భుజగేంద్రుని యొక్క కన్య , అనిమిష కన్య =అనిమిషులయొక్క కన్య , వియచ్చర కన్య =వియచ్చరులయొక్క కన్య , మానవకన్య =మానవులయొక్క కన్య ⟶ షష్ఠీతత్పురుషసమాసము
అనఘుడు అఘము లేనివాడు , అపూర్వము=పూర్వము కానిది నన్బహువ్రీహిసమాసము ⟶

**4. తనూజ్ఞావశవర్తులై మహిసమస్త క్షత్రవంశేశులె**
**ల్లను భక్తిం బనిసేయుచుండగ విశాలంబైన సత్కీర్తి ది**

**పరిచయం:** గంగ సాంగత్యం పోగొట్టుకుని హస్తినాపురానికి వచ్చిన శంతనుని పాలనను వర్ణిస్తూ కవి ఇలా అంటున్నాడు.
**ప్రతిపదార్థం :** శంతనుడు=శంతనుడు రాజత్ =ప్రకాశిస్తున్న ; రాజధర్మ =పాలకధర్మపు ; స్థితిన్ =ఉనికితో ; తనకు= తనకు ఆజ్ఞావశ =ఆజ్ఞకులోబడి ; వర్తులై = నడచుకున్నవారై ; మహిన్ = భూమిపై ; సమస్త =సమస్త ; క్షత్రవంశ =రాజవంశ ఈశులు+ ఎల్ల =ప్రభువులందరు ; భక్తిన్ =ఇష్టంగా ; పని=రాజకార్యాలు ; చేయుచు+ఉండగా= చేస్తుండగా ; విశాలంబు=దొడ్డది ; ఐన=

అయినట్టి ; సత్ +కీర్తి =మంచికీర్తి ; దిక్ +వనితా=దిక్కు అనెడి వనిత యొక్క ; మౌక్తికదామ =ముత్యాలదండ ; లీల= లాగా ; వెలుగన్ =వెలుగుతుండగా; వారాశిపర్యంత = సముద్రం వరకూవ్యాపించి ఉన్న ; భూజన=భూజనుల,రక్షాపరుడు = కాపాడుటలో ఆసక్తి గలవాడు, అయ్యె =అయ్యెను .

**<u>తాత్పర్యం :</u>** గంగను వీడి, గంగాతీరం నుండి తిరిగి వచ్చిన శంతనమహరాజు చక్కని రాజధర్మాన్ని పాటించాడు. రాజ్యంలో ఉన్న సమస్త సామంత రాజులు తన ఆజ్ఞకు లోబడి, ఇష్టంగా రాజ్యకార్యాలు చేస్తూ , నడుచుకున్నారు పెద్దదైన ఆయన కీర్తి , దిక్కు అనే వనితఅలంకరించుకున్న ముత్యాలదండ లాగా వెలిగింది . ఇలాంటి సుస్థిర పరిస్థితులలో ఆయనఏ బెంగా లేకుండా ప్రజాపాలనలో మునిగిపోయాడని భావం.

**<u>వ్యాకరణాంశాలు :</u>**

**<u>సంధులు</u>**

క్షత్రవంశ +ఈశులు=క్షత్రవంశేషులు → గుణసంధి

పరి+అంత=పర్యంత → యణాదేశసంధి

తనకు+ఆజ్ఞ =తనకాజ్ఞ , వశవర్తులు +ఐ=వశవర్తులై , ఈశులు+ ఎల్లను =ఈశు లెల్లను , చేయుచు+ఉండగ=చేయుచుండగ, విశాలంబు+ఐన=విశాలంబైన , పరుడు+అయ్యె =పరుడయ్యె

ఉత్వసంధి →

భక్తిన్ +పని=భక్తిం బని → సరళాదేశసంధి

పని+చేయు= పని సేయు → గసడదవాదేశసంధి

**<u>సమాసాలు</u>**

ఆజ్ఞావశవర్తులు =ఆజ్ఞకు వశవర్తులు , క్షత్రవంశేషులు =క్షత్రవంశ మునకు ఈశులు, రాజధర్మము =రాజు యొక్క ధర్మము , ధర్మస్థితి =ధర్మము యొక్క స్థితి షష్ఠీతత్పురుషసమాసము

సమస్తక్షత్రవంశము =సమస్తమైన క్షత్రవంశము ,
సత్కీర్తి =సత్ ద్రైన కీర్తి విశేషణపూర్వపదకర్మధారయసమాసము
దిగ్వనిత =దిక్కు అనెడి వనిత రూపకసమాసము

**II. సంగ్రహ సమాధానప్రశ్నలు :**

**1.గంగా వసువుల సమయమును ప్పందమును తెలుపండి లేదా గంగా వసువుల**

ఇక్ష్వాకు వంశంలో మహాభిషుడనే రాజు ఉండేవాడు. అతడు యజ్ఞయాగాలు చేసి , ఇంద్రాది దేవతల్ని సంతృప్తి పరచి దేవలోకానికి పోయినాడు . ఒకనాడు అతడు దేవర్షి గణాలతో కలసి బ్రహ్మను కొలుస్తున్నాడు . ఆ సభకు గంగ స్త్రీరూపం ధరించి వచ్చింది . గాలి రావడంవల్ల గంగచీర వైదొలగి , ఆమె ఊరుమూలం కనబడింది దేవతలంతా ముఖాలు పక్కకు తిప్పుకున్నారు , కానీ మహాభిషుడు మాత్రం సాభిలాషుడై ఆదృశ్యాన్ని చూసినాడు

మహాభిషుని చేష్టను గమనించిన బ్రహ్మ చాలా కోప పడి "మానవగర్భంలో పుట్టు " అని శపించాడు మహాభిషుడు భయపడి చేతులు జోడించి ," మానవ లోకం లోని రాజర్షులలో పుణ్యాత్ముడు ప్రతీపుడు . కాబట్టి నేను ఆయనకు పుత్రున్నై జన్మిస్తాను . ఇతరుల గర్భం లో పుట్టలేను " అని బ్రతిమాలి బ్రహ్మ అనుమతి పొంది , భూలోకం వచ్చేశాడు .

గంగకూడా మహాభిషుని రూపలావణ్యాలు , తనపట్ల అతనికి గల అభిలాషలను గ్రహించి , తానూ కామమోహితయై , అతన్నే తలచుకుంటూ మానవ లోకానికి వస్తున్నది . అలా వస్తున్న గంగ దారిలో దేవలోకం నుండి వెలివేయబడి , దుఃఖ పడుతూ ఎదురుగా వస్తున్న అష్టవసువు లను చూసింది చూసి "మీరు మీ నియోగాలు కోల్పోయి , ఎక్కడికో వెళ్ళ డానికి కారణమేమి " అని అడిగింది. అందుకు వారు ఎంతో వినయం గా ఇలా అన్నారు ." మేము వసిష్ఠమహర్షి శాపం వలన మానవ లోకంలో ఎవరైనా ఒక స్త్రీ

గర్భంలో జన్మించడానికి పోతున్నాం ” అని బాధపడుతూ తమ శాపవృత్తాంతం గంగకుచెప్పి నారు. ఇంకా వారు “ మేము ఇతరుల బిడ్డలుగా పుట్ట లేము. నీ గర్భంలోనే జన్మిస్తాము . మహాభిషుడు ప్రతీపునికి కొడుగ్గా పుడతాడు. అతనికీ నీకు సమాగమంజరుగుతుందిమా జన్మలకు కారణం కూడా తనే కాగలడు” అనిఅన్నారు .

వసువులు చెప్పింది విన్న గంగ“ నా అభిమతం కూడా అలాంటిదే మీకు ఉపకారంజరుగుతుందిశోకించకండి ” అని అన్నది . గంగమాటలువిన్న వసువులు“నీవు మాకు ఉపకారంచెయ్యగలిగితే , మేము నీ గర్భంలో పుట్టిన వెంటనే మమ్మల్ని నీటిలో వేసి మానవ లోకంలో దీర్ఘకాలం ఉండకుండా చెయ్యి . మాకు వసిష్ఠుని శాపం కూడా ఇలాంటిదే ” అని అన్నారు . దానికి గంగ “అలాగే చేస్తాను . కానీ మీరంతా స్వర్గస్థులైతే నాకు ఒక కొడుకైనా దీర్ఘాయుష్మంతుడై తోడు ఉండాలి కదా! మరి అదెలా ?” అని అన్నది . అందుకువారు “ మాలో ఒక్కొక్కరిలో తురీయాంశం దాల్చి అష్టమవసువు పుట్టి నీకు తోడుగా దీర్ఘకాలం భూమిపై ఉంటాడు” అనిఅన్నారు . ఇలాగంగా-వసువులకు ఒప్పందం(సమయం)కుదిరింది. తర్వాత కథ ఈ సమయంప్రకారమే జరిగింది .

## 2. గంగప్రతీపుల వృత్తాంతాన్ని

ఇక్ష్వాకు వంశంలో మహాభిషుడు అనే రాజు ఉండేవాడు. అతడుయజ్ఞయాగాలు చేసి , ఇంద్రాది దేవతల్ని సంతృప్తి పరచి దేవలోకానికి పోయినాడు . ఒకనాడు అతడుదేవర్షిగణాలతో కలసి బ్రహ్మను కొలుస్తున్నాడు . ఆ సభకుగంగ స్త్రీరూపం ధరించి వచ్చింది . గాలి రావడంవల్ల గంగచీర వైదొలగి , ఆమె ఊరుమూలం కనబడింది దేవతలంతా ముఖాలు పక్కకు తిప్పుకున్నారు , కానీ మహాభిషుడు మాత్రం సాభిలాషుడై ఆదృశ్యాన్ని చూసినాడు

మహాభిషుని చేష్టను గమనించిన బ్రహ్మ చాలా కోప పడి "మానవగర్భంలో పుట్టు " అని శపించాడు. మహాభిషుడు భయపడి చేతులు జోడించి ," మానవ లోకంలోని రాజర్షులలో పుణ్యాత్ముడు ప్రతీపుడు . కాబట్టి నేను ఆయనకు పుత్రున్నై జన్మిస్తాను . ఇతరుల గర్భం లో పుట్టలేను " అని బ్రతిమాలి బ్రహ్మ అనుమతి పొంది , భూలోకం వచ్చేశాడు . గంగ కూడా మహాభిషుని రూప లావణ్యాలు , తనపట్ల అతనికి గల అభిలాషలను గ్రహించి , తానూ కామమోహిత యై , అతన్నే తలచుకుంటూ మానవలోకానికి వచ్చింది .

భరతవంశ ప్రభువైన ప్రతీపుడు రాజ్యసుఖాలు అనుభవించి యమనియమవ్రత పరాయణుడై గంగాతీరంలో నిష్ఠగా తపస్సు చేసుకుంటున్నాడు . గంగ తీగలాంటి సన్నని నడుముతో, ఎగసిపడుతున్న స్తనద్వయంతో , పద్మాల్లాంటి కళ్ళతో ఒక దివ్య స్త్రీరూపం దాల్చి వచ్చి , కామపరవశయై, ప్రతీపుని విశాల మైన కుడితొడ మీదకూచున్నది,

ప్రతీపుడు ఆమెను చూసి ఆశ్చర్యపడి ," ఎవరునీవు? ఇలా నా తొడపై కూచున్నావెందుకు?" అని అడిగినాడు. దానికి గంగ "ఇంద్రసమాన! భానుతేజ ! నేను జహ్నుమహర్షి కూతురైన గంగనునీ సద్గుణాలు విని, నీకు భార్యగా వచ్చాను . నన్ను పరిగ్రహింపుము " అనిఅన్నది . ఆ మాటలకు ప్రతీపుడు ...

"అంబుజాక్షి ! నేను అగ్ని సాక్షిగ పరిణయంచేసు కున్న భార్యను ఒకదాన్ని తప్ప ఇతరులను మనస్సులో కూడా తలచుకోను అలాంటి జితాత్ముడైన నన్ను బేలవై ఇతరుల్ని అడిగినట్లు అడగడంతగదు అంతేకాక నువ్వు స్త్రీభాగమైన ఎడమతొడ ఎక్కకుండా, పురుషభాగమైన కుడితొడ పై కూచున్నావు . కాబట్టి నా కుమారుని పెళ్ళాడుపో " అని అన్నాడు . ఆమె " అలాగే " అని అదృశ్య మైంది . ఇదిగంగా-ప్రతీపుల వృత్తాంతం .

**3. వసిష్ఠుడు అష్టవసువులనుశపించినవిధం తెలపండి**

వరుణుడు అనే ముని అతులమైన తపస్సు, ఎన్నో పుణ్యకార్యాలు చేయగా వసిష్ఠుడు పుట్టినాడు . బ్రహ్మ సమానుడైన ఆ వసిష్ఠుడు మేరుపర్వతం లోని గుహలో ఆశ్రమం కల్పించుకుని తపస్సు చేశాడు . ఆయన వద్ద దక్షప్రజాపతి కూతురైన సురభికి, కశ్యపునికి పుట్టిన నందిని హోమధేనువుగా ఉండేది. అది కోరిన వస్తువులన్నీ ఇస్తుండగా వసిష్ఠుడు తపస్సు చేసుకుంటూఉండేవాడు.

ఒకనాడుఅష్టవసువులు తమభార్యలతో కూడి విహరిస్తూ వసిష్ఠుని ఆశ్రమానికి వచ్చినారు . వారక్కడ వసిష్ఠుని హోమధేనువైన నందిని లక్షణాలు చూసి అబ్బురపడ్డారు . అప్పుడు అష్టమవసువు భార్య మగనితో...“ఈ ఆవుపాలు తాగి మానవులు ముసలితనం,రోగాలు అన్నవి లేకుండా పదివేల ఏండ్లు దేవతల్లా జీవిస్తారట . దీనికి యజమాని అయినవాడే గొప్పవాడు . మానవ లోకంలో ఉశీనరరాజు కూతురైన జితవతి నా ప్రియసఖి. నేను ఎల్లప్పుడు దాని క్షేమం కోరుకుంటాను. ఈ హోమధేనువును ఆమెకు బహుమానంగాఇచ్చి పోదాం ” అనిఅన్నది , భార్య మాటలకు అనుగుణంగా అన్నలు ప్రోత్సహించగా అష్టమవసువైన ప్రభాసుడు ఆఆవునుపట్టుకుపోయాడు .

వసిష్ఠుడు తన హోమధేనువు కనపడక అడవంతాతిరిగినాడు . తిరిగి తరిగి విసిగి యోగదృష్టితో చూసి, వసువులుతనధేనువును పట్టుకొని పోయిన విషయాన్ని గ్రహించాడు . తన్నుకు వస్తున్నకోపంతో “ మానవులుగా పుట్టండి ” అని శపించాడు. వసువులుభయపడిపోయి, వినయంగా..

“ నీవు ధర్మమూర్తివి . మేము చేసిన తప్పు క్షమించి , మానవలోకంలో దీర్ఘకాలం ఉండకుండా మమ్మల్ని అనుగ్రహించండి” అని ప్రార్థించారు . అంతటవసిష్ఠుడు ప్రసన్నుడై “మీరు కోరినట్లే జరుగుతుంది కానీ కడగొట్టువాడైన ప్రభాసుడు చేసిన అపరాధం చాలా పెద్దది కాబట్టి వీడు మానవ

లోకంలో సుదీర్ఘకాలం ఉంటాడు అలాగే సంతానం లేనివాడై ఉంటాడు" అని అనుగ్ర హించాడు. ఇది అష్టవసువుల శాపవృత్తాంతం .

**III. వ్యాసరూప సమాధానప్రశ్నలు :**

## 1. గంగా– శంతనులవృత్తాంతాన్ని

**పరిచయం:** గంగా శంతనులవృత్తాంతం ఆదికవి నన్నయ రచించిన ఆంధ్రమహాభారతం , ఆదిపర్వం , చతుర్థాశ్వాసం నుండి గ్రహించిన "గంగా శంతనుకథ" అనే పాఠంలో ఉన్నది .

**మహాభిషుని ఉదంతం:** ఇక్ష్వాకు వంశంలో మహాభిషుడు అనే రాజు ఉండే వాడు. అతడుయజ్ఞయాగాలు చేసి , ఇంద్రాది దేవతల్ని సంతృప్తి పరచి దేవలోకానికి పోయినాడు . ఒకనాడు అతడు దేవర్షిగణాలతో కలసి బ్రహ్మను కొలుస్తున్నాడు . ఆ సభకు గంగ స్త్రీరూపం ధరించి వచ్చింది . గాలి రావడం వల్ల గంగ చీర వైదొలగి , ఆమె ఊరుమూలం కనబడింది దేవతలంతా ముఖాలుపక్కకు తిప్పుకున్నారు , కానీ మహా భిషుడు మాత్రం సాభిలాషుడై ఆ దృశ్యాన్ని చూసినాడు

మహాభిషుని చేష్టను గమనించిన బ్రహ్మ చాల కోపపడి "మానవగర్భంలో పుట్టుము " అని శపించాడు మహా భిషుడు భయపడి చేతులు జోడించి , " మానవ లోకంలోని రాజర్షులలో పుణ్యాత్ముడు ప్రతీపుడు . కాబట్టి నేను ఆయనకు పుత్రున్నై జన్మిస్తాను . ఇతరుల గర్భం లో పుట్టలేను " అని బ్రతిమాలి బ్రహ్మ అనుమతి పొంది , భూలోకం వచ్చేశాడు .

**గంగా వసువుల ఒప్పందం:** గంగకూడా మహాభిషుని రూపలావణ్యాలు , తన పట్ల అతనికి గల అభిలాషలను గ్రహించి , తానూ కామమోహితయై , అతన్నే తలచుకుంటూ మానవ లోకానికి వస్తున్నది . అలా వస్తున్న గంగ దారిలో దేవలోకం నుండి వెలివేయబడి , దుఃఖపడుతూ ఎదురుగా వస్తున్న అష్ట వసువులను చూసింది చూసి "మీరు మీ నియోగాలు కోల్పోయి , ఎక్కడికో

వెళ్ళ డానికి కారణమేమి ” అని అడిగింది. అందుకువారు ఎంతో వినయంగా.. “మేము వసిష్ఠమహర్షి శాపం వలనమానవలోకంలో ఎవ రైనా ఒకస్త్రీ గర్భంలో జన్మించదానికి పోతున్నాము ” అని బాధపడుతూతమశాప వృత్తాంతం గంగకుచెప్పినారు . ఇంకా వారు “మేము ఇతరుల బిడ్డలుగా పుట్టలేము . నీ గర్భంలోనే జన్మిస్తాం . మహాభిషుడు ప్రతీపునికి కొడుగ్గా పుడతాడు. అతనికీనీకు సమాగమంజరుగుతుందిమా జన్మలకు కారణం కూడా తనే కాగలడు” అనిఅన్నారు .

వసువులు చెప్పింది విన్న గంగ“ నా అభిమతం కూడా అలాంటిదే మీకు ఉపకారంజరుగుతుందిశోకించకండి ” అని అన్నది . గంగమాటలువిన్న వసువులు“నీవు మాకు ఉపకారంచెయ్యగలిగితే , మేము నీ గర్భంలో పుట్టిన వెంటనే మమ్మల్ని వెంటనే నీటిలో వేసి మానవలోకంలో దీర్ఘకాలం ఉండకుండాచెయ్యి . మాకు వసిష్ఠుని శాపం కూడా ఇలాంటిదే ” అనిఅన్నారు . దానికి గంగ “అలాగే చేస్తాను . కానీ మీరంతా స్వర్గస్థులైతే నాకు ఒక కొడుకైనా దీర్ఘాయుష్మంతుడై తోడు ఉండాలి కదా! మరి అదెలా ?” అని అన్నది . అందుకువారు “ మాలో ఒక్కొక్క రిలో తురీయాంశం దాల్చి అష్టమ వసువు పుట్టి నీకు తోడుగా దీర్ఘకాలం భూమిపై ఉంటాడు” ని అన్నారు . ఇలా గంగవసువులు ఒప్పందం చేసుకుని వెల్లిపోయారు .

**ప్రతీపుని వృత్తాంతం :** భరతవంశప్రభువైన ప్రతీపుడు రాజ్య సుఖాలు అనుభవించియమనియమవ్రతపరాయణుడై గంగా తీరంలో నిష్ఠగా తపస్సు చేసుకుంటున్నాడు . గంగ తీగలాంటి సన్నని నడుముతో, ఎగసిపడుతున్న స్తనద్వయంతో , పద్మా ల్లాంటి కళ్ళతో ఒకదివ్యస్త్రీరూపం దాల్చి వచ్చి , కామపరవశయై , ప్రతీపుని విశాలమైన కుడితొడ మీదకూచున్నది,

ప్రతీపుడు ఆమెను చూసి ఆశ్చర్యపడి , “ఎవరునీవు? ఇలానా తొడపై కూచున్నావెందుకు?” అని అడిగినాడు. దానికి గంగ “ఇంద్రసమాన! భానుతేజ ! నేను జహ్నుమహర్షి కూతురైన గంగనునీ

సద్గుణాలు విని, నీ భార్యగా వచ్చాను . నన్ను పరిగ్రహింపుము ” అనిఅన్నది . ఆ మాటలకుప్రతీపుడు ...

“అంబుజాక్షి !నేను అగ్ని సాక్షిగ పరిణయంచేసుకున్న భార్యను ఒక్కదాన్ని తప్ప ఇతరులనుమనస్సులో కూడా తలచుకోను అలాంటి జితాత్ముడైన నన్ను బేలవై ఇతరుల్ని అడిగినట్లు అడగడంతగదు అంతేకాక నువ్వు స్త్రీభాగమైన ఎడమతొడ ఎక్కకుండా, పురుషభాగమైన కుడితొడపై కూచున్నావు . కాబట్టి నా కుమారుని పెళ్ళాడు పో ” అని అన్నాడు . ఆమె “అలాగే ” అనిఅదృశ్యమైంది .

**గంగనుపెళ్ళాడమని ప్రతీపుడు శంతనునికిచెప్పడం :**

ప్రతీపుడు సంతానంకోసం తనభార్య ఐన సునందాదేవిని గూడి తీర్థయాత్రలు తిరిగి , వ్రతాలు చేసి , దీర్ఘకాలం తపస్సు చెయ్యగా వారికి వీరుడైన శంతనుడు పుట్టినాడు . పెరిగి ,యవ్వనంలోకి అడుగుపెట్టిన కుమారుని చూసి ప్రతీపుడు తనకుపుణ్యలోకాలు కలిగాయని సంతోషపడ్డాడు . సకలరాజ్య భారం అతనికిఅప్పగిస్తూ రాజుగా పట్టాభిషేకం చేసి ...

“నాకు గంగాతీరంలో ఒక అందమైన కన్నె కనిపించి, పెళ్ళాడమని కోరింది . నేను ఇంతకమనీయమైన రూపంగలనీవు నా పుత్రుని పెళ్ళాడుపో అన్నాను . దానికి ఆమె అంగీకరించింది. కాబట్టి నువ్వు ఆమెను కుల గోత్రాలు అడగకుండా స్నేహభావంతో వివాహం చేసుకోవాలి ” అని ఆజ్ఞాపించి , తపో వనానికి వెళ్ళిపోయాడు .

**గంగాశంతనుల సమాగమం:** శంతనుడురాజ్యపాలన చేస్తూ ఒకనాడు వేటకని ఒంటరిగా బయలుదేరి వెళ్ళాడు . అతనికి గంగాతీరంలో ఒక అందమైన కన్నె కనబడింది అతడు ఆశ్చర్యంగా , ప్రీతిగా ఆమెను చూశాడు. ఆమె కూడా అతనిరూపంచూసి మెత్తబడి , అనురాగ పూర్వకంగా అతనినే చూస్తున్నది . అప్పుడు మన్మధుడు వాళ్ళ చూపులనేబాణాలుగా తీసుకునికొట్టాడు .

గంగ తననుపలకరింపలేకున్న శంతనునిచూసి, అతనికి తనపై ఉన్న అనురాగాన్ని గుర్తించి "ఓరాజా ! నీకు నన్ను చేపట్టాలని ఉంటే నీవు నాకొక మాటివ్వాలి . అదిఏమిటంటే నేను ఏమిచేసినా దానికి నీవు అడ్డు చెప్పరాదు . నన్ను అప్రియాలు పలుకరాదు నీవు ఎప్పుడైనా మాట తప్పి నన్ను అప్రియాలు పలికితే ఆ క్షణమే నిన్ను వదలి వెళ్ళి పోతాను " అని అన్నది . దానికి శంతనుడుఒప్పుకుని ఆమెను పరిగ్రహించాడు .

**గంగ శంతనునివీడిపోవడం** గంగా తీరంలో సుఖిస్తున్న గంగా-శంతనులకువరుణుడాదిగా గలవసువులువరుసగాపుట్ట నారంభించారు గంగపుట్టినవారిని పుట్టినట్లే నీటిలో పారవేస్తు న్నది . తననువిడిచిపోతుందన్న భయంతో శంతనుడుఅడ్డు చెప్పకుండా ఉన్నాడు . చివరగా వారికి ఆనందం కలిగిస్తూ అష్టమవసువు పుట్టాడు . గంగఅతణ్ణి కూడా నీటిలో వెయ్య డానికి బయలు దేరింది . శంతనుడుఆమెకు అడ్డు చెప్పాడు .

గంగ తాము పూర్వం చేసుకున్న ఒప్పందాన్ని తలచుకుని, "నీతో నా బంధంఇంతే" నని, తాను జహ్నుమహర్షి కుమార్తె అయినగంగననివసువులశాపవృత్తాంతం చెప్పి , తననిజరూపంచూపి, దేవవ్రతుడైన ఈ మన కుమారుడు పెద్దవాడయ్యేంత వరకు నాతోనే ఉంటాడని శంతనునికిచెప్పించి వెళ్లిపోయింది . శంతనుడు విస్మయం చెంది హస్తినకు చేరాడు .

**దేవవ్రతుని శంతనునికిఅప్పగించడం** శంతనుడుమరొకసారి వేటకని గంగాతీరానికి పోయి అక్కడ ధనుర్విద్యభ్యాసం చేయు చున్న ఒక యువకున్ని చూశాడు. యువకుడుశంతనుడు ఏదో తెలియని అనురాగంతో ఒకరినొకరు చూసుకుంటూ ఉండ గా గంగ యువకుని కుడిచేయి పట్టుకు వచ్చి ." ఓ రాజా ! వీడే నీ కుమారుడు" అని చెప్పింది . ఆయువకుడేదేవవ్రతుడు .

**IV. సదర్భసహితవ్యాఖ్యలు :**

**1.సాభిలాషుడై చూచె మహాభిషుండు**

**పరిచయం** ఈ వాక్యం ఆదికవి నన్నయ రచించిన ఆంధ్ర మహాభారతం, ఆదిపర్వం, చతుర్థాశ్వాసం నుండి గ్రహించ బడిన గంగా శంతనుల కథ అనే పాఠంలోనిది .

**సందర్భం** గంగాదేవి బ్రహ్మ సభకు వచ్చినప్పుడు జరిగిన సంఘటనను కవి ఇలా వర్ణిస్తున్నాడు .

**వివరణ** బ్రహ్మ సభలో గాలి వియ్యడం వల్ల గంగ చీర చెదిరి పోయి ఆమె ఊరుమూలలు కనబడింది ఆ దృశ్యాన్ని చూడకుండా దేవతలు అంతా ముఖాలు పక్కకు తిప్పు కున్నారు . కానీ మహాభిషుడు మాత్రం కావాలని చూశాడని భావం.

2. **ఏమొండచోటజన్మింప నోపము (లేదా)**
3. **వానికి నీకు సమాగమంబగు**

**పరిచయం**

**సందర్భం** వసిష్ఠముని వల్ల మానవలోకంలో పుట్టమని తమకు కలిగిన శాపవృత్తాంతాన్ని అష్టవసువులు గంగకు చెప్పి ఆమెను ఇలా వేడు కున్నారు .

**వివరణ** మేము మానవలోకంలో ఇతరులెవరి కడుపు లోను పుట్టలేము . నీ గర్భంలోనే జన్మిస్తాము . మహాభిషుడు శంత నుడు అనే పేరుతో ప్రతీపుని కుమారునిగా జన్మిస్తాడు . అతనికి – నీకు సమాగమం జరుగుతుంది అతడే మా జన్మకు కారకుడౌతాడు అని భావం.

4. **ఇష్టమున పరిగ్రహింపు నన్ను**

**పరిచయం**

**సందర్భం** గంగా తీరంలో తపస్సు చేసుకుంటున్న శంతనుని తొడపై గంగ వచ్చి కూచున్నపుడు నీవెవరు? నా తొడపై కూచున్నావెందుకు? అని అతడు అడగగా గంగ శంతనునితో ఈ మాటలన్నది .

**వివరణ** నేను జహ్నుమహర్షి కుమార్తె ఐన గంగను నీ సద్గు ణాలు విని నిన్ను ఇష్టపడి నీకు భార్యగా వచ్చాను . నన్ను ఇష్టంగా భార్యగా స్వీకరించు అని భావం.

**5. ఇట్లని పలుకంగ నీకునగునే**

**<u>పరిచయం</u>**

**<u>సందర్భం</u>** నీ సద్గుణాలు విని నిన్ను ఇష్టపడి నీకు భార్యగా వచ్చాను . నన్ను ఇష్టంగా భార్యగా స్వీకరించుము అని గంగ అన్నపుడు ప్రతీపుడు ఈ మాటలన్నాడు .

**<u>వివరణ</u>** నేను అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్యను తప్ప యితరులను మనస్సులో కూడా తలచుకోను అలాంటి <u>జితాత్ముడైన</u> నన్ను ఇలా అడగడం తగునా? తగదని భావం.

**6. అక్కోమలి కులగోత్రనామంబులడుగకూని ఇష్టంబు**

**<u>పరిచయం</u>**

**<u>సందర్భం</u>** తనకుమారుడైన శంతనునికి రాజుగా పట్టాభిషేకం చేసి అతనితో ప్రతీపుడు ఈ మాటలన్నాడు .

**<u>వివరణ</u>** గంగా తీరంలో నాకు ఒక అందమైన కన్నె కనబడి తనను పెళ్ళాడమని కోరింది . ఇంత <u>కమనీయమైన రూపం</u>గల నీవు నా కుమారుని పెళ్ళాడుపో అని నేను అనగా ఆమె ఒప్పుకున్నది . కాబట్టి నీవు ఆమెను కులగోత్రాలు గాని పేరు గాని అడగకుండా పెళ్లిచేసుకోవాలి అనిభావం.

**7. అయ్యనఘుడుదాని చిత్తమున నాదటపోవక**

**<u>పరిచయం</u>**

**<u>సందర్భం</u>** శంతనుడు వేటకని గంగా తీరానికి పోయి అక్కడ ఒక అందమైన కన్నెను చూసి ఆశ్చర్యపడు తున్నపుడు అతని అవస్థని కవి ఇలా వర్ణిస్తున్నాడు .

**<u>వివరణ</u>** ఈమె వనకన్యో , రాక్షస కన్యో , నాగ కన్యో , దేవ కన్యో , అచ్చర కన్యో , అయ్యుండాలి . ఇది అద్భుతం. మానవకన్య ఇలా ఒంటరిగా వనంలోకి రాగలదా? అని ఆమెను తనివి తీరక ఇష్టంగా చూశాడని భావం.

**8. నీ వెందులదానవు**

**పరిచయం:**

**సందర్భం** గంగా శంతనులుఒకిరి నొకరు చూసు కున్నప్పటి సందర్భాన్ని కవి ఇలావర్ణించాడు .

**వివరణ** గంగా-శంతనులు ఒకరినొకరు కామపరవశులై చూసుకుంటున్నపుడు శంతనుడు నీవు ఎవరని అడగ లేక మిన్నకుండిపోయాడు . అప్పుడు గంగఅది తెలుసు కుని అతనికి తన పట్ల ఉన్న గాఢమైన అనురాగాన్ని గుర్తించి , ఆమే తమవివాహ ప్రస్తావన చేసిందని భావం.

## 9. నీతోడి సంగతినాకునింతియ

**పరిచయం:**

**సందర్భం** గంగకుఅష్టమ గర్భంలో పుట్టిన బిడ్డను కూడా నీటిలో వెయ్యడానికి పోతుండగా శంతనుడుఅడ్డు చెప్పాడు . అప్పుడు గంగఅతనితో ఈ మాటలన్నది .

**వివరణ**నేను చేసే చర్యలకు అడ్డు చెప్పినపుడే నిన్ను వదలి పోతానని మనకముందే ఒప్పందం ఉన్నది . మరి ఇప్పుడు నీవు నాకు అడ్డు చెప్పి , అప్రియాలు పలికావు . కాబట్టి నీకు-నాకు ఇంతే ఋణానుబంధమికనిన్ను వదలివెళ్లిపోవు చున్నానని భావం.

## 10. ఏనెప్పుడు దానికి ప్రియంబు

**పరిచయం:**

**సందర్భం** అష్టవసువులు వసిష్ఠముని ఆశ్రమంలో అతని హోమధేనువైన నందినిని చూసి ఆశ్చర్యపడినపుడు అష్టమ వసువుభార్య వారితో ఈ మాటలన్నది .

**వివరణ**మానవలోకంలో ఉశీనరరాజు కుమార్తె జితవతి నా ప్రియసఖి . నేను ఎప్పుడు దాని క్షేమం కోరుకుంటాను . ఈ హోమధేనువునుఆమెకు కానుకగా ఇచ్చిపోదాం అని భావం.

## V. పదసాధురూపాలు

దార్తరాష్టుడు =ద్రుతరాష్టుడు ,
సవుందర్యము =సౌందర్యము
మన్మదుడు =మన్మథుడు , యవ్వనము=యౌవనము
దర్మమూర్తి =ధర్మమూర్తి , అగ్నానము =అజ్ఞానము
శూనుడు=సూనుడు వశిష్టుడు =వసిష్ఠుడు
సంతనుడు=శంతనుడు కస్యపుడు =కశ్యపుడు ,
యోగద్రుష్టి =యోగదృష్టి
భూషణాలంక్రుతుడు=భూషణాలంకృతుడు

# 2. ద్రౌపది పరిదేవనము

**I. ప్రతిపదార్థాలు :**

1.తనుమునుబద్ధ బన్నములుదమ్మునిపై గలకూర్మి పేర్మి నీ
జనపతిసైపకున్నె యదిసక్కన రాజ్యముపాలు లేక తీ

**పరిచయం**: ఈ పద్యం కవిబ్రహ్మ తిక్కన రచించిన ఆంధ్ర మహా భారతం ఉద్యోగపర్వం, తృతీయాశ్వాసం నుండి గ్రహించ బడిన ద్రౌపదిపరిదేవనము అనే పాఠం లోనిది. పాండవుల పక్షాన కౌరవుల వద్దకు రాయబారం పోతున్న శ్రీకృష్ణునితో తన అభిప్రాయాన్ని చెబుతూ ద్రౌపది ఇలా అంటున్నది.

**ప్రతిపదార్థం** : కేశవా = ఓ శ్రీకృష్ణా!; ఈ జనపతి = ఈ ధర్మరాజు; తమ్మునిపై = తమ్ముడైన దుర్యోధనునిపై; కల = ఉన్న; కూర్మిన్ = ప్రేమకొద్దీ; తను = తాను; మును = ఇంతకుపూర్వం; పడ్డ = పడిన (దుర్యోధనుని వల్ల); బన్నములు = కష్టాలు; సైపక = మన్నింప కుండా; ఉండునె = ఉంటాడా; అది = మరి; చక్కన = తగు విధంగా; రాజ్యముపాలు = రాజ్యభాగము; లేక = లేకనే; తీరునకు = సంధికి; ఒడబాటు = అంగీకారం; కల్గిన = కుదిరితే; లోకము వారు = ప్రజలు; ఎరుంగమి = తెలివి తక్కువతనాన్ని (పాండవులకు); పెట్టరె = అంటగట్టరా?; వీరు = ఈ పాండవులు; చాలరు + ఐరి = సాధించలేకపోయిరి; అనరు + ఒకొ = అనరా?; నానలేమి = సిగ్గు లేనితనం; అని = అని; ఆడరే = ఆడిపోసుకోరా?

**తాత్పర్యం** : ఓ కృష్ణా! ఈ ధర్మరాజు తమ్ముడైన దుర్యోధనునిపై ఉన్న మక్కువ కొద్దీ అతని వల్ల తమకు కలిగిన అన్యాలు, అవమానాలు మన్నించేస్తాడు. అలా రాజ్యభాగం లేకుండానే సంధి చేసుకుంటే పాండవులు తెలివి తక్కువ వారని, కౌరవు లను వీరు ఎదుర్కోలేక పోయిరని, ఇది పాండవుల సిగ్గులేని తనం అని ప్రజలు ఆడిపోసుకుంటారని భావం.

**వ్యాకరణాంశాలు :**

**సంధులు**

బన్నములున్ + తమ్మునిపైన్ + కల = బన్నములు దమ్మునిపై గల

ఒడన్ + పాటు = ఒడ బాటు → పడ్వాదేశాసంధి

అది + చక్కన = అదిసక్కన → గసడదవాదేశాసంధి

సైపక + ఉన్నె = సైప కున్నె → అత్వసంధి

తీరునకు+ఒడబాటు=తీరున కొడబాటు , చాలరు+ఐరి=చాలరైరి
వీరు+అనరు+ఒకో =వీరనరొకో ⟶ ఉత్వసంధి

**<u>సమాసాలు</u>**

కూర్మి పేర్మి =కూర్మి యొక్క పేర్మి , జనపతి=జనులకు పతి
⟶ షష్ఠీతత్పురుషసమాసము

రాజ్యముపాలు =రాజ్యము నందలిపాలు, లోకమువారు= లోకము నందలివారు ⟶ సప్తమీతత్పురుషసమాసము

**2. వరమునబుట్టితిన్ , భరతవంశముజొచ్చితిన్ , నందుబాండుభూ**
**వరునకుగోడలైతి , జనవంద్యుల బొందితి, నీతివిక్రమ**

**<u>పరిచయం</u>**

**<u>ప్రతిపదార్థం :</u>** సరసిజనాభ=పద్మము నాభియందు గలవాడా! ( ఓ శ్రీకృష్ణా !);వరమున=(దేవతలు ఇచ్చిన )వరంచేత, పుట్టితిన్ =జన్మించాను ; భరతవంశము=భరతుడు మూలపురుషుడుగా ఉన్న కౌరవవంశంలోకి ;జొచ్చితిన్ =అడుగుపెట్టాను ; అందున్= ఆ భారతవంశంలో; పాండు భూపతికి=పాండురాజుకు, కోడలు +ఇతి=కోడలయ్యాను ; జనవంద్యుల =జనులచేత వందనాలు అందుకున్న పంచ పాండవుల, పొందితి =భర్తలుగా పొందాను ; నీతి =నీతి ; విక్రమ =పరాక్రమం చేత ; స్థిరులు +అగు, ఖ్యాతి గాంచిన; పుత్రులన్ =కుమారులను, పడసితిన్ =కన్నాను ; సహ జన్ముల =అన్నదమ్ముల ; ప్రాపు =ప్రాపకం ; కాంచితిన్ =అందుకు న్నాను . ఇన్నిట =ఇన్ని విషయాల్లో ; ప్రశస్తికి =ప్రశస్తికి ; ఎంతయున్=మిక్కిలి ; ఎక్కినదానన్ =ఎక్కిన దానిని .

**తాత్పర్యం** : ఓ శ్రీకృష్ణా ! నేను దేవతావరం వల్ల జన్మించాను , భరతవంశంలో అడుగుపెట్టాను (కోడలిగా ), ఆ భరతవంశంలోకూడా గొప్పవాడైన పాండురాజుకుకోడ లయ్యాను . జనవంద్యు లైన పంచపాండవులను భర్తలుగా పొందాను ,

నీతిమంతులు పరాక్రమవంతులైన కుమారుల్ని కన్నాను, అన్నదమ్ముల ప్రాపకం పొందాను, ఇన్ని విషయాల్లో ప్రసిద్ధి గాంచాను. (అలాంటి నన్ను కౌరవులు అలా అవమానింప వచ్చా ? అవమానింపరాదుఅనిభావం)

**వ్యాకరణాంశాలు :**

సంధులు వరమునన్+పుట్టితిన్ =వరమున బుట్టితిన్ , భరత వంశమున్+చొచ్చితిన్ , భరతవంశమజొచ్చితిన్ , అందున్+ పాండు భూవరునకున్+కోడలు=అందుబాండు భూవరునకు గోడలు,జనవంద్యులన్ +పొందితి =జనవంద్యుల ‹బొందితి , పుత్రు లన్+పడసితిన్ =పుత్రులం బడసితిన్, ఇన్నిట న్ +ప్రశస్తి = ఇన్నిట ‹ బ్రశస్తి సరళాదేశాసంధి

కోడలు+ఐతి, స్థిరులు +అగు=స్థిరులగు ఉత్వసంధి

**సమాసాలు**

భరతవంశము=భరతుడు మూలపురుషుడిగా గల వంశము

సరసిజనాభుడు=సరసిజమునాభియందుగలవాడు

బహువ్రీహి సమాసము

పాండుభూవరుడు=పాండురాజు అనే పేరుగలభూవరుడు

సంభావనాపూర్వపదకర్మధారయసమాసము

జనవంద్యులు =జనంచేతవంద్యులు తృతీయాతత్పురుషము

నీతివిక్రమస్థిరులు =నీతివిక్రమములందుస్థిరులు సప్తమి

3. నీవు సుభద్ర కంటె ‹ **గడునెయ్యము గారవముతలిర్ప సం భావనచేయు దిట్టి ననుబంకజనాభయొకండు రాజసూ**

**పరిచయము**

**ప్రతిపదార్థం** : పంకజనాభ=పద్మము నాభియందు గలవాడా! ( ఓ శ్రీకృష్ణా !); నీవు=నీవు; సుభద్రకంటె =నీ చెల్లి ఐనసుభద్ర

కన్నా ; కడు=మిక్కిలి ; నెయ్యము =స్నేహభావం ; గారవమున్= మర్యాద ; తలిర్పన్ =తళుకొత్తగా ; సంభావన=సమ్మానము ; చేయుదు=చేస్తావు ; ఇట్టి =ఇలాంటి; నను=నన్ను ; ఒకండు= ఒక అనామకుడు(దుశ్శాసనుడు); రాజసూయ=రాజసూయం అనే; అధ్వరంబు=యాగం; అందు=లో ; శుచి+ఐ=శుభ్రమై ; పెనుపు+ఒందిన=ఒప్పుచున్న ; వేణి =జుట్టును ; పట్టి =పట్టుకుని; ఈ=ఈ; ఏవురు= ఐదుమంది జూడగా=చూస్తుండగా ; సభకు=సభలోకి ; ఈడ్చె =ఈడ్చాడు కుల+అంగనన్=కులస్త్రీని ; ఇట్లు =ఈ విధంగా; ఒనర్తురు +ఏ=చేస్తారా ?

**తాత్పర్యం** : ఓ శ్రీకృష్ణా ! నీవు నన్ను నీ చెల్లి ఐనసుభద్ర కంటే కూడా ఎక్కువ స్నేహంగా , మర్యాదగా చూస్తావు . అలాంటి నన్ను ఒకానొక అనామకుడు(దుశ్శాసనుడు), రాజసూయ యాగంలో శుచిగా ఉన్న నా కొప్పు బట్టి , ఈ ఐదుమంది పాండవులు చూస్తుండగా సభలోకి ఈడ్చుకు వచ్చాడు . బుద్ధి ఉన్న వాళ్ళెవరైనా ఇలా కులస్త్రీని అవమానిస్తారా ? అని అర్థం . శ్రీకృష్ణుడు అంతటివాడుచెల్లిగా మన్నించే ఆవిడని, అందునా కులస్త్రీని అలాఅవమానించకూడదని భావం.

**<u>వ్యాకరణాంశాలు :</u>**

**<u>సంధులు</u>**

సుభద్రకంటెన్ +కడు=సుభద్ర కంటె గడు, గారవమున్+తలిర్ప = గారవముందలిర్ప, ననున్+పంకజనాభ= నను బంకజ నాభ, ఏవురున్+చూడన్+కా ,=యేవూరు జూడగా , ఈడ్చెన్ +కులాంగన=ఈడ్చె గులాంగన ⟶ సరళాదేశసంధి

వేణి +పట్టి =వేణివట్టి ⟶ గసడదవాదేశాసంధి

చేయుదు+ఇట్టి = చేయుదిట్టి , పెనుపు+ఒందిన ఇట్లు +ఒనర్తురే = ⟶ ఇట్లొనర్తురే

ఉత్వసంధి

రాజసూయ+అధ్వరము=రాజసూయాధ్వరము, కుల+అంగన=కులాంగన సవర్ణదీర్ఘసంధి ⟶

**సమాసాలు**

పంకజనాభుడు = పంకజము నాభియందు కలవాడు

బహువ్రీహిసమాసము

రాజసూయావబృథము = రాజసూయము అనే పేరుగల అవ భృథము

సంభావనాపూర్వపదకర్మధారయసమాసము

కులాంగన = కులమునందలి అంగన → సప్తమీతత్పురుషము

4. ద్రోవది బంధురంబయిన క్రొమ్ముడి
క్రమ్మన విడ్చి వెండ్రుకల్
దా వలచేత **బూనియసితచ్ఛవి బొల్చు
మహాభుజంగమో**

**పరిచయం:**

**ప్రతిపదార్థం :** ద్రోవది =ద్రౌపది ; బంధురంబు ఐన =ఒప్పిదమైన ; క్రొమ్ముడి = కొత్తగా ముడివేసిన జుట్టు ; క్రమ్మన =దురుసుగా; విడ్చి =వదులుగా చేసి ; వెండ్రుకల్ =వెంట్రుకల్ని ; తా =తాను; వలచేత =కుడిచేతిలో ; పూని =పట్టుకుని ; అసిత = నల్లని ; చవిన్ =రంగులో; పొల్చు =ఒప్పు ; మహా = గొప్ప ; భుజంగము ఓ = పామేమో !; నాన్ =అనునట్లు ; విలసిల్లి = ఒప్పిదమై ; వ్రేలగ = వేలాడుతుండగా; మనంబున =మనస్సులో ; పొంగు =పొంగి వస్తున్న ; విషాదరోషముల్ = విషాదం, రోషాలు ; కావగలేక = అనచుకోలేక; బాష్పముల్ = కన్నీళ్లు ; క్రమ్మగ =కమ్ముకుని రాగా ; దిగ్గన =గబాలున లేచి =లేచి ; ఆర్త +ఐ=ఆర్తి చెందినదై (ఆ వెంట్రుకలు ఆయనముందుపెట్టి తన అక్కసు శ్రీకృష్ణునికి చెప్పుకున్నది )

**తాత్పర్యం :** ద్రౌపది తన ఒప్పిదమైన జుట్టు వెంట్రుకలముడి దురుసుగా విదిలించి, ఆ జుట్టు నల్లత్రాచు పాము లాగా వేలాడు తుండగా,మనస్సులో పొంగుకొస్తున్న విషాద రోషాలను అనచుకోలేక , కళ్ళలో కన్నీరు కమ్ముకుని వస్తుండగా ,

గబాలున లేచి , బాధపడుతూ జుట్టుని కుడిచేతిలో పట్టుకుని శ్రీకృష్ణుని ముందుపెట్టి , అతనికి చూపిస్తూ ...(తన అక్కసు వెల్లబోసు కున్నదని భావం)

**వ్యాకరణాంశాలు :**

**సంధులు**

బంధురంబు+అయిన=బంధురంబయిన → ఉత్వసంధి

భుజంగము+ఓ=భుజంగమో → ఉత్వసంధి

క్రొమ్ముడిన్ +క్రమ్మన =క్రొమ్ముడి గ్రమ్మన ,

వలచేతన్ +పూని వలచేత బూని,

అసితచ్ఛవి +పొల్చు =అసితచ్ఛవి → బొల్చు ,

మనంబునన్+పొంగు =మనంబున బొంగు సరళాదేశసంధి

బాష్పములు +క్రమ్మగ =బాష్పములు గ్రమ్మగ

గసడదవాదేశాసంధి

**సమాసాలు**

క్రొమ్ముడి =క్రొత్తదైన ముడి, అసితచ్ఛవి =అసితమైన చవి, వలచేయి=వలపలిదైన చేయి , మహా భుజంగము=గొప్పదైన భుజంగము → విశేషణపూర్వపదకర్మధారయము

విశాదరోషములు=విషాదమును,రోషమును

→ ద్వంద్వసమాసము

**II. సంగ్రహ సమాధానప్రశ్నలు :**

1. ద్రౌపది తనభంగపాటునుతెలిపిన విధం

ధర్మరాజు సంధి చేసుకుని రమ్మని చెప్పిన మాటలు ద్రౌపదికి ఎంతో బాధ కలిగించాయి. ఆమె తన అభిప్రాయంగా శ్రీకృష్ణునితో ఇలాచెప్పింది .

కౌరవులు మాకు అప్పుడు అంతలేసి అన్యాయాలు , అవమానాలుచేసి , ఇప్పుడు సంజయునిచేత ఉత్తుత్తి రాయబారం

పంపినారు ఆ మాత్రానికే ఈ ధర్మరాజు తృప్తిపడి పోయాడు. ఈయనకోరినంత మాత్రాన దుర్యోధనుడు ఐదు
గురికి ఐదుఊళ్లు ఇచ్చేస్తాడా ? ఇవ్వడు.

తమ్ముడైన దుర్యోధనుడిపై ఉన్న ఇష్టం కొద్ది ఈ ధర్మ రాజు అతనివల్ల పడ్డ కష్టాలు మరిచిపోకపోడు. అలా రాజ్య భాగం లేకుండానే సంధి చేసుకుంటే పాండవులు దద్దమ్మలని ప్రజలంతా అనుకుంటారుతమకుఅంతఅన్యాయం చేసిన కౌరవులతో యుద్ధం చెయ్యడానికి ఇంత ఆలోచించాల్సిన పని లేదు. వీరు పోయి చంపుతుంటే ఊరుకుండడానికివాళ్ళేమి బాపనోళ్ళు కాదు.

దుర్యోధనుని మనసులో ఓటమి అనే మాటే లేదు. అలాంటప్పుడు వాడు సంధికి రాడు. మీది వృథాప్రయాస. అక్కడా సంధి కుదరకపోతే ఈ పాండవులు యుద్ధానికి సిద్ధపడ తారో, మళ్ళీ అడవులకుమరిగెడతారో అర్థం కావడం లేదు. అయినా నేను నా అక్కసు కొద్ది ఇలా అన్నానని మీరు యుద్ధం కొనితెచ్చుకోవద్దు .మీకెలా మంచిదనిపిస్తే అలాచేసుకోండి.

నేను వరం వల్ల ద్రుపదుని కూతురుగా పుట్టాను. పాండురాజు కోడలు అయ్యాను. పరాక్రమవంతులైన ఐదు మంది భర్తలు, ఐదుమంది కుమారులు నీ అంతటి అన్న నాకు అండగా ఉన్నారు. అలాంటి నన్ను అనామకుడైన దుశ్శాస నుడు రాజసూయయాగంలో జుట్టుపట్టి సభకు ఈడ్చాడు. ఇవి దుశ్శాసనుని చేయి పడి సగం తెగిపోయి మిగిలిన వెంట్రుకలు. కౌరవులందరిని యుద్ధంలో చంపినా కళ్ళారా చూసినపుడువీటిని పట్టించుకుంటాను. అప్పటికి గాని నా పగచల్లారదు.

## 2. కృష్ణుడు ద్రౌపదిని ఓదారుస్తూ

ద్రౌపది భంగపాటునువిన్న శ్రీకృష్ణుడు ఆమెను కరుణ తో ఊరడింపజేసి కూచోబెట్టినాడు. ఆమె కన్నీరు తుడవమని జుట్టు ముడివేయమని తగినవారికి చెప్పినాడు. తర్వాత ఆమె తో ఇలాఅన్నాడు.

అమ్మా ! ద్రౌపది ఇంకా దాచడందేనికి ధర్మరాజు నాకు భీముని, అర్జునుని తోడుగా ఇచ్చి పంపితే నువ్వు మెచ్చునట్లు శత్రువులైన కౌరవుల్ని చీల్చి చెండాడనా . ఐనా ఆ దురాత్ము లైన కౌరవులు రాజ్యభాగం ఇవ్వరు.

నువ్వు ఏడ్వడం చాలించు ఇంక చూడు నువ్వు ఎలా ఎడుస్తున్నావో అలా కౌరవులు వారి భార్యలు ఏడవాలి. ఆ ఏడ్పులు నువ్వు కలకళువ్వుతూ వినే కాలం ఆసన్నమైంది . యముని మహిషం యొక్క ఘంటారావాలు వినాలని ఆశపడుతున్న కౌరవులకు శాంతివచనాలు ఇంపుగా ఉండవు వాళ్ళ తలరాత కూడా అదేనని పెద్దలు అంటున్నారు. ఏ విధంగా ఆలోచించి చూసినా, మేరుపర్వతం తలకిందులైనా సరే అది జరక్క మానదు

చెబుతున్నా విను శత్రునాశం జరగడం పాండవులు సిరిసంపదల్తో తులతూగడం నీవు తొందరగా చూస్తావు . ఇది నిజం అనికృష్ణుడు చెప్పగా ద్రౌపది ఊరడిల్లింది .

**III. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు :**

3. ద్రౌపది తన భంగపాటును శ్రీకృష్ణునికి

**పరిచయం** కవిబ్రహ్మ తిక్కన రచించిన ఆంధ్రమహాభారతం , ఉద్యోగపర్వం , తృతీయశ్వాసం నుండి గ్రహించబడిన ద్రౌపది పరిదేవనము అనే పాఠంలో ఆమె భంగపాటు చెప్పడం ఉన్నది .

ధర్మరాజు సంధి చేసుకుని రమ్మని చెప్పిన మాటలు ద్రౌపదికి ఎంతో బాధ కలిగించాయి. ఆమె తన అభిప్రాయంగా శ్రీకృష్ణునితో ఇలా చెప్పింది .

కౌరవులు మాకు అప్పుడు అంతలేసి అన్యాయాలు , అవమానాలు చేసి , ఇప్పుడు సంజయుని చేత ఉత్తుత్తి రాయ బారం పంపినారు ఆ మాత్రానికే ఈ ధర్మరాజు తృప్తిపడి పోయాడు . ఈయన కోరినంత మాత్రాన దుర్యోధనుడు ఐదు గురికి ఐదు ఊళ్లు ఇచ్చేస్తాడా ? ఇవ్వడు. అలా ఇవ్వకుండా అన్నదమ్ములనే ఏడిపించడం అతనికి కూడా తగదు

తమ్ముడైన దుర్యోధనుడిపై ఉన్న ఇష్టం కొద్ది ఈ ధర్మ రాజు అతని వల్ల పడ్డ కష్టాలు మరిచిపోకపోడు . అలా రాజ్య భాగం లేకుండానే సంధి చేసుకుంటే పాండవులు అజ్ఞానులని ,దద్దమ్మలని ప్రజలంతా అనుకుంటారు

తమకు అంత అన్యాయం చేసిన కౌరవులతో యుద్ధం చెయ్యడానికి ఇంతఆలోచించాల్సిన పని లేదు. వారిని చూసి పోరి సాధించడానికి ఈడు కారనో , లేకపోతె దాయాదుల్ని చంపే దెలా ? అనో అనుకుంటున్నారేమో . వీరు పోయి చంపు తుంటే ఊరుకుండడానికివాళ్ళేమైనా బాపనోళ్ళా ?

ఎవడైనా సంధికి రావాలంటే వాడికి ఓటమి భయండుండాలి. దుర్యోధనుని మనసులోఓటమి అనే మాటే లేదు. అలాంటప్పుడు వాడు సంధికి రాడు. మీది వృథాప్రయాస . అక్కడా సంధికుదరకపోతే ఈ పాండవులుఅప్పుడైనా యుద్ధా నికి సిద్ధపడ తారో , లేక మళ్ళీ అడవులకుపరిగెడతారో అర్ధం కావడంలేదు.

అయినా నేను నా అక్కసు కొద్ది ఇలా అన్నాను . నా మాటల్ని పట్టించుకోకండి . బాధలో ఉన్న మనిషికి వివేకం ఉండదునువ్వు , ఈ రాజు, తనతమ్ములు కలసిఉచితమేదో చూచి మన కార్యం , మీ సుజనత్వంచెడ కుండామీకుఇష్టమై
నట్లు కౌరవులతో సంధిచేసుకోండి .

నేను వరం వల్ల ద్రుపదుని కూతురుగా పుట్టాను . పాండురాజు కోడలు అయ్యాను . పరాక్రమవంతులైన ఐదు మంది భర్తలు , ఐదుమంది కుమారులు అన్నదమ్ములు నాకు అండగా ఉన్నారు . నీవు నన్ను నీ చెల్లి సుభద్ర కంటే కూడా మిక్కిలి స్నేహంగా , మర్యాదగా చూస్తావు . అలాంటి నన్ను అనామకుడైన దుశ్శాసనుడు రాజసూయయాగంలోజుట్టుపట్టి
సభకుఈడ్చాడు . ఏకవస్త్రగా ఉన్న నన్ను ఆ సభకుఈడ్చుకు వచ్చి , దుశ్శాసనుడు బాధపెడుతుంటే ఏమీ చెయ్యలేక నా భర్తలు చిత్రాలలాగా చూస్తుండిపోయారు . అప్పుడు చివరకు నేను నిన్ను ప్రార్థించాల్సి వచ్చింది .

అప్పుడు దృతరాష్ట్రుడు తనకేమీ తెలియదన్నట్లు కోడలని కూడా చూడకుండా నన్ను దాసిగా చేసినాడు. ఇప్పుడు మళ్ళీ నా భర్తలు తనవద్దకు పోతుంటే నేనూ వీళ్ళతో బాటు పోయి కొడంట్రికము వెలగబెడుదునా? లేక మళ్ళీ దాసిరికము చేస్తునా ? నీవే చెప్పు అనిఎత్తిపొడిసింది . ఇంకా తనజుట్టు విప్పి కృష్ణుని ముందుపెట్టి ...

" ఇవి దుశ్శాసనుని చేయి పడి సగం తెగిపోయి మిగి లిన వెంట్రుకలు. కౌరవులందరిని యుద్ధంలో చంపి నా కళ్ళారా చూసినపుడువీటిని పట్టించుకుంటాను . అప్పటికి గాని నా పగ చల్లారదు . ఈ వెంట్రుకలు పట్టి ఈడ్చిన ఆ దుశ్శాసనుని శరీరం తునకలుతునకలై పడి ఉండగాచూస్తే నా పగతీరుతుందిగాని ఊరికే తీరుతుందా? ధర్మరాజు , నేను ఆ దుర్యోధనుని పీనుగను కళ్లారా చూడాలి. అలా జరక్కపోతే ఈ భీముని బాహుబలం గాండీవం చేత బట్టిన అర్జునుని పరాక్రమం ఎందుకు కాల్చడానికా ? రాక్షసి మొండిగా నిప్పును ఒడిలో పెట్టుకున్నట్లు ఇంతటి కసి నా గుండెల్లో దాచుకున్నాను. దుష్ట శిక్షణ చేసి జగాలుకాసే నీ అంతటిఅన్న ఉండి పరాక్రమ వంతులైన నా భర్తలు ఉండి కూడా ఈ నా పగ అనే నిప్పు ఎంతో కాలం నుండి ఆరిపోకుండా ఉన్నది " అని ద్రౌపది తన భంగపాటు చెప్పుకుని గద్గదికతో ఏడ్చింది . ఈ విధంగా ద్రౌపది తన భంగాపాటునుశ్రీకృష్ణునికి చెప్పుకున్నది .

**VI. సదర్భసహితవ్యాఖ్యలు :**

1. నాన లేమి యనియాడరె లోకమువారు కేశవా ?

**పరిచయం**ఈ వాక్యం కవిబ్రహ్మ తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం, ఉద్యోగపర్వం , తృతీయాశ్వాసం నుండి గ్రహించ బడినద్రౌపదిపరిదేవనము అనే పాఠంలోనిది .

**సందర్భం** పాండవుల పక్షాన కౌరవుల వద్దకు రాయబారం పోతున్న శ్రీకృష్ణునితో తన అభి ప్రాయాన్ని చెబుతూ ద్రౌపది ఇలాఅంటున్నది.

**వివరణ**: కృష్ణా ! ఈ ధర్మరాజు తమ్ముడైన దుర్యోధనునిపై ఉన్న మక్కువ కొద్దీ అతని వల్ల తమకు కలిగిన అన్యాలు, అవమానాలు మన్నించేస్తాడు. అలా రాజ్యభాగం లేకుండానే సంధిచేసుకుంటే పాండవులు తెలివి తక్కువ వారని, కౌరవులను వీరు ఎదుర్కోలేక పోయిరని, ఇది పాండవుల సిగ్గులేని తనమని ప్రజలు ఆడిపోసుకుంటారని భావం.

2. వారు బ్రాహ్మణులే ఏకీడైన సైరింపగన్

**పరిచయం**:

**సందర్భం**: పాండవుల పక్షాన కౌరవుల వద్దకు రాయబారం పోతున్న శ్రీకృష్ణునితో తన అభి ప్రాయాన్ని చెబుతూ ద్రౌపది ఇలా అంటున్నది.

**వివరణ**: తమకు అంత అన్యాయం చేసిన కౌరవులతో యుద్ధం చెయ్యడానికి ఇంత ఆలోచించాల్సిన పని లేదు. వారిని చూసి పోరి సాధించడానికి ఈడు కారనో, లేకపోతె దాయాదుల్ని చంపేదెలా ? అనో అనుకుంటున్నారేమో. వీరు పోయి చంపుతుంటే ఊరుకుండడానికి వాళ్ళేమైనా బాపనోళ్ళా అని ఎద్దేవా చేసిందని భావం.

3. వీరిడియైన మానిసికి వెండి వివేకము కల్గ

**పరిచయం**:

**సందర్భం**: పాండవుల పక్షాన కౌరవుల వద్దకు రాయబారం పోతున్న శ్రీకృష్ణునితో తన అభిప్రాయాన్ని చెబుతూ ద్రౌపది
ఇలా అంటున్నది.

**వివరణ**: నేను కష్టాలు పోవడం, ప్రయోజనం కలగడం ఎరుగక వదరుబోతు దాన్నై, మనసులో ఏమీ దాచుకోకుండా మాట్లాడుతున్నాను బాధలో ఉండి వెర్రెక్కిన మనిషికి వివేకం ఉండదు అని భావం.

4. కులాంగనమిట్లొనర్తురే ?

**పరిచయం**

**సందర్భం** పాండవుల పక్షాన కౌరవుల వద్దకు రాయబారం పోతున్న శ్రీకృష్ణునితో తన అభిప్రాయాన్ని చెబుతూ ద్రౌపది
ఇలాఅంటున్నది.

**వివరణ**ఓ శ్రీకృష్ణా ! నీవు నన్ను నీ చెల్లి ఐనసుభద్ర కంటే కూడా ఎక్కువ స్నేహంగా , మర్యాదగా చూస్తావు . అలాంటి నన్ను ఒకానొక అనామకుడు(దుశ్శాసనుడు ), రాజసూయ యాగంలో శుచిగా ఉన్న నా కొప్పు బట్టి , ఈ ఐదుమందిపాండవులుచూస్తుండగా సభలోకి ఈడ్చుకు వచ్చాడు . బుద్ధి ఉన్న వాళ్ళెవరైనా ఇలా కులస్త్రీని అవమానిస్తారా ? అని అర్థం . శ్రీకృష్ణుడు అంతటివాడుచెల్లిగా మన్నించే ఆవిడని, అందునాకులస్త్రీని అలాఅవమానించకూడదని భావం.

5. తలపవలయుమ్మ్యుత !వీనిన్ .

**పరిచయం**

**సందర్భం** పాండవుల పక్షాన కౌరవుల వద్దకు రాయబారం పోతున్న శ్రీకృష్ణునితో తన అభిప్రాయాన్ని చెబుతూ ద్రౌపది దుశ్శాసనుడు పట్టి తెంచిన తనజుట్టును చూపిస్తూ ఇలాఅంటున్నది.

**వివరణ** ఇవి దుశ్శాసనుని చేయి పడి సగం తెగిపోయి మిగి లిన వెంట్రుకలు . కౌరవులందరిని యుద్ధంలో చంపి నా కళ్ళారా చూసినపుడువీటిని పట్టించుకుంటాను . అప్పటికి గాని నా పగ చల్లారదు అనిభావం.

6. దురాత్ములు కారావు లుర్వి యిత్తురే ?

**పరిచయం**

**సందర్భం** కౌరవుల వల్ల తనకు కలిగిన భంగాపాటును చెప్పి విలపిస్తున్న ద్రౌపదితో శ్రీకృష్ణుడు ఈ మాటలన్నాడు .

**వివరణ**అమ్మా ! ద్రౌపది ఇంకా దాచడందేనికి ధర్మరాజు నాకు భీముని, అర్జునుని తోడుగా ఇచ్చి పంపితే నువ్వు మెచ్చునట్లు శత్రువులైన కౌరవుల్ని చీల్చి చెండాడనా . ఐనా ఆ దురాత్ము లైన కౌరవులు రాజ్యభాగం ఇవ్వరు. కాబట్టి సంధి జరగదునీ పగ చల్లారకపోదు అనిభావం.

7. తప్పదు మేరువు దిరిగెనేని ‹ బాంచాలసుతా!

**పరిచయం:**

**సందర్భం** కౌరవుల వల్ల తనకు కలిగిన భంగపాటును చెప్పి విలపిస్తున్న ద్రౌపదితో శ్రీకృష్ణుడు ఈ మాటలన్నాడు .

**వివరణ** నువ్వు ఏడ్వడం చాలించు ఇంక చూడు నువ్వు ఎలా ఎడుస్తున్నావో అలా కౌరవులు వారి భార్యలు ఏడవాలి. ఆ ఏడ్పులు నువ్వు కలకళువ్వుతూ వినే కాలం ఆసన్నమైంది . యముని మహిషంయొక్క ఘంటారావాలు వినాలని ఆశపడుతున్న కౌరవులకు శాంతివచనాలు ఇంపుగా ఉండవు వాళ్ళ తలరాత కూడా అదేనని పెద్దలు అంటున్నారు. ఏ విధంగా ఆలోచించి చూసినా, మేరుపర్వతం తలకిందులైనా సరే అదిజరక్క మానదుఅనిభావం.

8. తడవులేదిది నిజంబు

**పరిచయం:**

**సందర్భం** కౌరవుల వల్ల తనకు కలిగిన భంగపాటును చెప్పి విలపిస్తున్న ద్రౌపదితో శ్రీకృష్ణుడు ఈ మాటలన్నాడు .

**వివరణ**అమ్మా ! చెబుతున్నా విను శత్రునాశం జరగడం,పాండవులు సిరిసంపదల్తో తులతూగడమీవు తొందరగా చూస్తావు . ఇది నిజం అనిభావం.

**v. పదసాధురూపాలు**

ద్రౌపతి =ద్రౌపది ,

యుధిష్టిరుడు =యుధిష్ఠిరుడు ,

బ్రమ్మణులు =బ్రాహ్మణులు ,
విక్రమర్మస్తిరులు =విక్రమస్థిరులు
ప్రసస్తి =ప్రశస్తి ,
మాథవుడు=మాధవుడు,
పుత్రులు=పుత్రులు
భాస్పములు =బాష్పములు ,
దుష్ఠులు =దుష్టులు

# 3. కన్యక

**I. సంగ్రహ సమాధాన ప్రశ్నలు :**

1. సెట్టి రాజుతో పలికినమాటలేవి ?

మహాకవి గురజాడగారు రచించిన "కన్యక" కవితలో పూజకని వీరభద్రుని ఆలయానికి పోతున్న కన్యకను ఆ ఊరి రాజు పట్టి ఎత్తుకు పోవాలని చూసినపుడు ఆమె తండ్రి అయినసెట్టి తన

చుట్టాలు చుట్టూ ఉండగా, సేవకులూ పలా నిలిచి ఉండగా చేతులు జోడించి , రాజుతో ఇలా అని అన్నాడు .

“ రాజ్యమేలే రాజు కన్యను బలవంతగా చేపట్టాలా ? ఈ కన్నె మీ సొమ్మే కదా! మా కన్నెను మీరు కోరడం కన్నా మా వైశ్యజాతికి వేరే అదృష్టం ఉంటుందా? కానీ మా బంధువర్గాన్ని , కులం పెద్దల్ని కొద్దిగా మన్నించి వారి ఆశీసుల్ని తీసుకుని అగ్నిసాక్షిగా కన్నెను పెళ్లాడండి . ఆ పైన ఎన్ని కానుకలైనా తీసుకోండి . అలా చేసి మా వైశ్యజాతి గౌరవమర్యాదల్ని కాపా డండి” అని అన్నాడు .

సెట్టి మాటలను రాజు అపహాస్యం చేసి దమననీతికి దిగినపుడు సెట్టి మళ్ళీ “ ఓ రాజా , ముందు దేవకార్యం , ఆవల రాచకార్యం అని పెద్దలు అన్నారు కదా! మీరు శలవిస్తే మా ఇలవేల్పు వీరభద్రుని పూజ చేసి వస్తాం . ఆ పైన మీ ఇష్టం ” అని తన అనుభవం లౌక్యం ప్రదర్శించాడు . అంత రాజు “ అయితే మేమూ దేవళానికి వస్తాం ” అని వారి వెంట పోయాడు .

2. రాజు సెట్టితో చెప్పిన పలుకులేవి?

మహాకవి గురజాడ వారి “ కన్యక ” కవితలో తన బిడ్డ ఐన కన్యక వీరభద్రుని పూజ చేసుకుని వచ్చేలా అవకాశం ఇవ్వమని, ఆ తర్వాత ఆమెను అగ్నిసాక్షిగా పెళ్ళాడమని సెట్టి కోరినపుడు రాజు ఎగతాళిగా నవ్వి ఇలా అన్నాడు .

“ ఓహొ హొ పట్టం గట్టుకున్న రాచబిడ్డకు ఒక సెట్టి ధర్మ మార్గం నేర్పించడమా ? రాజు తలచిందే ధర్మం , రాజు చెప్పిం దంతా శాస్త్రం . రాజులకు గాంధర్వవివాహం ప్రసిద్ధిగాంచిన పద్ధతి కాదా ? ఇష్టం ఉంటే ఆలస్యం చెయ్యకుండా , తల్లడిల్లకుండా , నేడు రేపని గడువులు పెట్టకుండా పిల్లనివ్వు . లేకుంటే ఇక్కడి నుండి వెళ్ళిపో .

పిట్టను పట్టిన డేగ మళ్ళీ విడుస్తుందా ? మీ కన్నె మళ్ళీ మీ ఇంటికి వస్తుందా ? కానుకలు తెచ్చి ఇవ్వు . నీవు

వచ్చేంత వరకుఇక్కడే ఉంటాను అని పొగరుగా మాట్లాడి నాడు. వారు పూజకు పోయిన గుడికి తనూ పోయి కన్నె అగ్నికి ఆహుతి కావడానికి కారణమయ్యాడు .

3. కన్యక జనులనుఉద్దేశించి ఏమన్నది?

భక్తిపారవశ్యంతో దుర్గపూజ చేసిన కన్యక అక్కడున్న జనులతో ఇలా అని అన్నది. " అన్నలారా! తండ్రులారా! ఒక
విన్నపం వినండి మీకు ఆలుబిడ్డలను కాపాడుకోవాలనే ఆశ లేదా ? రాజు పట్టమేలే వాడైతే , రాజునేలే దైవం లేడా ? పరువు కాపాడుకోవాలనే పౌరుషం మీకు ఎందుకుకలగడంలేదు. విద్య నేర్చినవాడు విప్రుడు అంటారు వీర్యం ఉండినవాడు క్షత్రియుడు అంటారు దానిని మీరు మరచిపోయారు. పదవులు చేపట్టాలనే ఆశ లేకుండా కాసిన్ని కాసులు ఉంటే చాలని అనుకున్నారు. వీర్యం ఎరుగక విద్య నేర్వక బుద్ధి మాలి ఉంటే ఇక్కట్లు రావా ? ఇప్పటికైనా మేల్కోండి . బుద్ధి బలం బాహుబలంపెంచుకుని దైవం మీద భారం వేసి , రాజులై బతకండి అని కన్యక వైశ్య జనులనుచైతన్యపరచింది .

4. కన్యక రాజుతో ఏమనిపలికినది?

" బుద్ధి బలంబాహుబలంపెంచుకుని దైవం మీద భారం వేసి , రాజులై తలెత్తుకుని బతకండి అని కన్యక వైశ్య జనులను చైతన్యపరచి ,రాజువైపు తిరిగి ఇలాఅన్నది.

" పట్టపగలు , నడివీధిలో జారులు చోరులు కూడా కన్నెలను పట్టబోరు . అలాంటిది నీవు పట్టబోయావు . ఇక నీవు ఎలా రాజవుతావు ? కండకావరం ఎక్కి నీవు ఇలాంటి దుండ గానికి పాల్పడితే దైవం ఉండడా? ఉండి నీ ఆగడాలు చూస్తూ ఊరుకుంటాడా? అదిగో కులంపెద్దలు ఇక్కడే ఉన్నారు. సాక్షికి అగ్ని ఇక్కడే ఉంది నీ కన్ను పడినకన్నె ఇక్కడే ఉంది ఇంకా ఆలస్యం దేనికి ? నీవు పట్టమేలే రాజువైతే , నీకు పౌరుషం

ఉంటే నన్ను పట్టుకో " అంటూ కన్యక అగ్నిగుండంలో దూకి ఆత్మాహుతిచేసుకున్నది .

**II. వ్యాసరూప సమాధానప్రశ్నలు :**

కన్యక వృత్తాంతాన్ని తెలియజేయండి .

మహాకవి గురజాడ అప్పారావుగారు తమ "కన్యక " కవితలో పూర్వకాలంలో కొందరు దుష్టప్రభువులు అధికార మదంతో సామాన్య జనులపైచేసిన ఆగడాలనుఖండగట్టారు .

ఒకానొకనాడు ఒకవైశ్యకన్య చక్కగా అలంకరించుకునితన పరివారంతో దుర్గను పూజించాలని తమకులదైవమైన వీరభద్రుని గుడికి పోతుంటుంది. రాచవీధిలో పోతున్న ఆమెను ఆ ఊరి రాజు చూసి, తన దుష్టమంత్రులతో కలసి బలవంతంగాపట్టబోతాడు . అకస్మాత్తుగా తనకుకలిగిన విపత్తును ఎదుర్కో డానికి ఇక దైవమే గతి అనిఅనుకొని ఆమె దిట్టతనం పూని రాజుతో ...

" ఓ రాజా , నన్ను పట్టుకోకు . నేను దైవకార్యం తీర్చి వస్తాను . నీవు ఈ రాజ్యానికి రాజువు. నేను ఈ ఊరి సెట్టి కూతురునునీకుదక్కకుండా ఎక్కడికి పోతాన " ని అన్నది .

కన్యక వెంట వస్తున్న ఆమె తండ్రి అయినసెట్టి తన చుట్టాలు చుట్టూ ఉండగా, సేవకులుకాపలా నిలిచి ఉండగా చేతులుజోడించి ,రాజుతో ఇలాఅన్నాడు .

" రాజ్యమేలే రాజు కన్యను బలవంతగాచేపట్టాలా ?ఈ కన్నె మీ సొమ్మే కదా! మా కన్నెను మీరు కోరడం కన్నా మా వైశ్యజాతికి వేరే అదృష్టం ఉంటుందా? కానీ మా బంధువర్గాన్ని , కులంపెద్దల్ని కొద్దిగా మన్నించి వారి ఆశీసుల్ని తీసుకుని అగ్నిసాక్షిగా కన్నెను పెళ్లాడండి . ఆ పైన ఎన్ని కానుకలైనా తీసుకోండి . అలా చేసి మా వైశ్యజాతి గౌరవమర్యాదల్ని కాపా డండి" అనిఅన్నాడు .

సెట్టి మాటలు విని రాజు ఎగతాళిగా నవ్వి ఇలా అన్నాడు ."ఓహోహో పట్టంగట్టుకున్న రాచబిడ్డకు ఒక

సెట్టి ధర్మ మార్గం నేర్పించడమా ? రాజు తలచిందే ధర్మం , రాజు చెప్పిం దంతా శాస్త్రం . రాజులకు గాంధర్వవివాహం ప్రసిద్ధిగాంచిన పద్ధతి కాదా ? ఇష్టం ఉంటే ఆలస్యం చెయ్యకుండా , తల్లడిల్లకుండా , నేడురేపని గడువులు పెట్టకుండా పిల్లనివ్వు . లేకుంటే ఇక్కడి నుండివెళ్ళిపో .

పిట్టను పట్టిన డేగ మళ్ళీ విడుస్తుందా ? మీ కన్నె మళ్ళీ మీ ఇంటికి వస్తుందా ? కానుకలు తెచ్చి ఇవ్వు . నీవు వచ్చేంత వరకుఇక్కడే ఉంటాను అనిపొగరుగా మాట్లాడి నాడు.

సెట్టి మళ్ళీ " ఓ రాజా , ముందు దేవకార్యం , ఆవల రాచకార్యం అని పెద్దలు అన్నారు కదా! మీరు శలవిస్తే మా ఇలవేల్పు వీరభద్రుని పూజచేసి వస్తాం . ఆపైన మీ ఇష్టం " అని తనఅనుభవఛౌక్యం ప్రదర్శించాడు .

రాజు " అయితే మేమూ దేవళానికి వస్తాం అక్కడే అగ్నిసాక్షిగా కన్నెను చేపడతాం" అనివారి వెంటపోయాడు . ఆ రోజు గుడిలో గుండంఆకాశాన్ని తాకుతూ మండుతున్నది . అదిచూసి రాజు గుండెలో దిగులు పట్టుకున్నది . భక్తిపారవశ్యంతో దుర్గపూజ చేసిన కన్యక అక్కడున్న జనులతో ఇలా అని అన్నది . "అన్నలారా ! తండ్రులారా ! ఒక విన్నపం వినండి. మీకు ఆలుబిడ్డలను కాపాడుకోవాలనే ఆశ లేదా ? రాజు పట్టమేలే వాడైతే , రాజునేలే దైవం లేడా ? పరువు కాపాడు కోవాలనే పౌరుషం మీకు ఎందుకుకలగడంలేదు. విద్య నేర్చిన వాడు విప్రుడు అంటారు వీర్యం ఉండినవాడుక్షత్రియుడు అంటారు దానిని మీరు మరచిపోయారు. పదవులుచేపట్టాలనే ఆశ లేకుండా కాసిన్ని కాసులు ఉంటే చాలని అనుకున్నారు. వీర్యం ఎరుగక విద్య నేర్వక బుద్ధి మాలి ఉంటే ఇక్కట్లు రావా ? ఇప్పటికైనా మేల్కోండి . బుద్ధి బలం బాహుబలం పెంచుకుని దైవం మీద భారం వేసి , రాజులై తలెత్తుకు బతకండి అని కన్యక వైశ్య జనులనుచైతన్యపరచింది .

కన్యక తర్వాత రాజువైపు తిరిగి ఇలా అన్నది. “పట్టపగలు , నడివీధిలో జారులు చోరులు కూడా కన్నెలను పట్టబోరు . అలాంటిది నీవు పట్టబోయావు . ఇక నీవు ఎలా రాజవుతావు ? కండకావరం ఎక్కి నీవు ఇలాంటి దుండగానికి పాల్పడితే దైవం ఉండడా? ఉండి నీ ఆగడాలు చూస్తూ ఊరుకుంటాడా? అదిగో కులంపెద్దలు ఇక్కడే ఉన్నారు . సాక్షికి అగ్ని ఇక్కడే ఉంది నీ కన్ను పడిన కన్నె ఇక్కడే ఉంది ఇంకా ఆలస్యం దేనికి ? నీవు పట్టమేలే రాజువైతే , నీకు పౌరుషం ఉంటే నన్ను పట్టుకో ” అంటూ కన్యక అగ్నిగుండంలో దూకి ఆత్మాహుతి చేసుకున్నది .

పట్టపురాజు గర్వం మట్టిలో కలసిపోయింది. అతనికోట పేటలు కూలి నక్కలకు ఆవాసాలైనాయి . కన్నె ఆత్మాహుతి ఎక్కడ చేసుకుందో అక్కడ ఒక సౌధం ఆకాశమంతఎత్తు లేచింది . కన్నె కీర్తి , రాజు అపకీర్తి పదాల్లో , పద్యాల్లో నిలిచాయి.

**III. సదర్భసహితవ్యాఖ్యలు :**

| |
|---|
| 1. నగరిసుందరులందరొకెత్తొక్కా ? |

**పరిచయం:** ఈ వాక్యం మహాకవి గురజాడ గారు రచించిన “ కన్యక ” అనే కవితలోనిది .

**సందర్భం:** దుర్గపూజ కోసం రాజవీధిలో పోతున్న కన్యకను చూసి ఆ ఊరినేలే రాజు ఈ మాటలుఅన్నాడు .

**వివరణ:** ఈ కన్నె చుక్కల మధ్యలో చద్రునిలాగా వెలుగుతున్నది . మన అంతఃపురంలో అందగత్తెలని పేరుగాంచిన అందగత్తెలు ఈమె అందముందుదేనికీ పనికిరారని భావం.

| |
|---|
| 2. కట్టవలెరా గండపెండెం. |

**పరిచయం:** ఈ వాక్యం మహాకవి గురజాడ గారు రచించిన “ కన్యక ” అనే కవితలోనిది .

**సందర్భం** దుర్గపూజ కోసం రాజవీధిలో పోతున్న కన్యకను చూసి ఆ ఊరినేలే రాజు ఈ మాటలుఅన్నాడు .

**వివరణ** ఈమెను మనఅధికారం చేత సొంతం చేసుకోవాలి . తద్వారా మన్మథరాజ్యం కొట్టాలి . రసికులలో వీడే రసికుడని గండపెండేరం కట్టించుకోవాలి అని అర్థం . అనగా ఈమెను చేపట్టడం ద్వారా ఈ రాజు చాలా రసికుడనిఅనిపించుకోవాలని ఉందనిభావం.

3. దేవకార్యం తీర్చి వచ్చెద .

**పరిచయం** ఈ వాక్యం మహాకవి గురజాడ గారు రచించిన " కన్యక " అనే కవితలోనిది .

**సందర్భం** దుర్గపూజ కోసం రాజవీధిలో పోతున్న కన్యకను చూసి ఆ ఊరినేలే రాజు అధికారం చేత సొంతం చేసుకోవాలని ప్రశ్నిస్తున్నపుడు కన్యక ఈ మాటలన్నది .

**వివరణ** ఓ రాజా ! నీవు ఈ పట్టణమేలే రాజువు. నేను ఈ ఊరి సెట్టి కూతుర్ని . తప్పించుకుని ఎక్కడికి పోతాను . గుడిలో పూజ చేసి వస్తాను . అంతవరకు నన్ను ముట్టుకోకని భావం.

4. రాజు తలంచిందేను ధర్మం . లేదా రాజు

**పరిచయం** ఈ వాక్యం మహాకవి గురజాడ గారు రచించిన " కన్యక " అనే కవితలోనిది .

**సందర్భం** మా కన్నెను మీరు కోరడం కన్నా మా వైశ్యజాతికి వేరే అదృష్టం ఉంటుందా? కానీ అగ్నిసాక్షిగా కన్నెను పెళ్లాడండి . మా వైశ్యజాతి గౌరవమర్యాదల్ని కాపాడండి అన్న సెట్టితో రాజు ఈ మాటలన్నాడు .

**వివరణ** ఓహో హో! పట్టంగట్టుకున్న రాచబిడ్డకు ఒక సెట్టి ధర్మ మార్గం నేర్పించడమా ? రాజు తలచిందే ధర్మం , రాజు చెప్పిం దంతా శాస్త్రం అర్థం . రాజు అభిప్రాయాలకు, మాటలకు తిరుగు లేదని భావం.

5. డేగ పిట్టను పట్టి విడుచునె

**పరిచయం** ఈ వాక్యం మహాకవి గురజాడ గారు రచించిన "కన్యక" అనే కవితలోనిది .

**సందర్భం** మా కన్నెను మీరు కోరడం కన్నా మా వైశ్యజాతికి వేరే అదృష్టం ఉంటుందా? కానీ అగ్నిసాక్షిగా కన్నెను పెళ్లాడండి . మా వైశ్యజాతి గౌరవమర్యాదల్ని కాపాడండి అన్న సెట్టితో రాజు ఈ మాటలన్నాడు .

**వివరణ** ఇష్టం ఉంటే ఆలస్యం చెయ్యకుండా , తల్లడిల్లకుండా , నేడురేపని గడువులు పెట్టకుండా పిల్లనివ్వు . లేకుంటే ఇక్కడి నుండి వెళ్ళిపో . పిట్టను పట్టిన డేగ మళ్ళీ విడువదు నా కన్ను పడ్డ మీ కన్నె మళ్ళీ మీ ఇంటికి రాదు. మేమే చేపడతాం అని అర్థం .

6. విద్య నేర్చినవాడు విప్రుడు .

**పరిచయం** ఈ వాక్యం మహాకవి గురజాడ గారు రచించిన "కన్యక" అనే కవితలోనిది .

**సందర్భం** రాజుల దమనకాండకు బలైపోవద్దని వైశ్యజనులను చైతన్య పరుస్తూ కన్యక ఈ మాటలన్నది .

**వివరణ** విద్య నేర్చిన వాన్ని విప్రుడు అంటారు వీర్యం ఉన్న వాన్ని క్షత్రియుడు అని అంటారు ఆ రెండు అలవరుచుకుని హక్కులు తెలుసుకుని తలెత్తుకు బతకండి అని భావం.

7. నిలిచెను కీర్తులపకీర్తుల్ .

**పరిచయం** ఈ వాక్యం మహాకవి గురజాడ గారు రచించిన "కన్యక" అనే కవితలోనిది .

**సందర్భం** కన్యక రాజు దమననీతికి బలికావడం ఇష్టం లేక వీర భద్రుని గుడిలో ఆత్మాహుతి చేసుకున్నపుడు కవి ఈ మాటలు అన్నాడు .

**<u>వివరణ</u>** పట్టపురాజు గర్వం మట్టిలో కలసిపోయింది. అతని కోట పేటలు కూలి నక్కలకు ఆవాసాలైనాయి . కన్నె ఆత్మాహుతి ఎక్కడ చేసుకుందో అక్కడ ఒకసౌధం ఆకాశమంతుఎత్తు లేచింది . కన్నె కీర్తి , రాజు అపకీర్తి పదాల్లో , పద్యాల్లో నిలిచాయి అనిభావం.

**iv. పదసాధురూపాలు**

రాజవీది =రాజవీధి

శాశ్త్రం =శాస్త్రం

ఘాందర్వం =గాంధర్వం

విప్రుడు=విప్రుడు

సౌథము=సౌధము

ఖండకావరం=కండకావరం

# 4. దేశ చరిత్రలు

## I. సంగ్రహ సమాధాన ప్రశ్నలు :

1. నరజాతి చరిత్ర వేటితో నిండి ఉందని కవి

" మా దేశ చరిత్ర గొప్పది , మా దేశ చరిత్ర గొప్పది "అని మనం అనుకుంటున్న దేశచరిత్రల్లో నిజానికి ఎంత గొప్ప ఉందో మహాకవి శ్రీశ్రీ తమ దేశచరిత్రలు కవితలో నిగ్గుతెల్చారు . నిజానికి ఏ దేశచరిత్రలోనూ గర్వించదగ్గ విషం ఏమీ లేదని ఆయన అభిప్రాయపడ్డాడు .

శ్రీశ్రీ నరజాతిచరిత్ర అంతా పరపీడనపరాయణత్వం తోటి , పరస్పర ఆహరణోద్యోగం తోటి , రణరక్తప్రవాహాల తోటి తడిసి పోయిందంటాడు.

ఇంకా ధనవంతులు దరిద్రులను కాల్చుకుతినడాల తోటి , బలవంతులు దుర్బలులను బానిసలుగా చేసుకోడాల తోటి నిండిపోయి , పిశాచగణాల సమవాకారంగా, బీభత్సరస ప్రధానంగా కనబడుతుందంటాడు

చరిత్ర అంతటా మరణించిన జనసందోహం తత్పలితంగా చల్లారిన సంసారాలు అసహాయుల ఆహాకారాలు , మూలుగుతున్నాయంటాడు .

వైషమ్యం , స్వార్థపరత్వం , కౌటిల్యం , ఈర్ష్యలు , స్పర్థలు , మాయలు లాంటి చెడు గుణాలు పెచ్చు పెరిగి చరిత్రగతిని మార్చివేశాయని వాపోయారు శ్రీశ్రీ .

2. చీకటి కోణంలో పడిన ఎవరిని గురించి శ్రీ

మహాకవి శ్రీశ్రీ తమ దేశచరిత్రలు కవితలో చరిత్ర అంటే రాజ్యాలు , యుద్ధాలు , తారీఖులు, దస్తావేజులు , రాణుల ప్రేమ పురాణాలు, ముట్టళ్ళకైన ఖర్చులు, కైఫీయతులు కాదని, నిజమైన చరిత్ర వెలుగులోకి రాకుండా పోయిందని అన్నారు. శ్రీశ్రీ చరిత్రకు సరికొత్త నిర్వచనం ఇచ్చారు . నిజమైన చరిత్ర అంటే చరిత్ర అట్టడుగున కనిపించకుండా పడి ఉన్న కథలన్నీ కావాలని, అవి దాచేస్తే దాగని సత్యాలని చెప్పారు .

చరిత్ర అంటే... నైలునది నాగరికత గొప్పలు కాదు, అక్కడ సామాన్యుడి జీవనం ఎలా ఉండేదో కావాలి . తాజమహల్ నిర్మించిందెవరు అన్నది కాదు, దాని నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలువివరాలు కావాలి . రాజ్యాల దండయాత్రలు కాదు, వాటిలో సామాన్యులు చేసిన సాహసాలు కావాలి . ప్రభువు ఎక్కిన పల్లకి కాదు, దాని మోసిన బోయీలు ఎవరో తెలియాలి .

చరిత్ర అంటే... తక్షశిల , పాటలీపుత్రం , మధ్యధరా సముద్రతీరం, హరప్పా , మొహంజొదారో , క్రో -మాన్యాన్ గుహ ముఖాల్లో మానవనాగరికత వికాసం ఎలా జరిగిందో తెలియాలి . ఏ దేశం ఏ కాలంలో ఏమి సాధించింది. అక్కడ ఏ శిల్పం , ఏ సాహిత్యం , ఏ శాస్త్రం , ఏ సంగీతం ఎలా ప్రగతి సాధించిందో బయటపడాలి. ఈ మానవ ప్రయాణం ఏ స్వప్నం కోసం, ఏ విజయం కోసం అర్రులు చాస్తూ వచ్చిందో తెలియాలి . అదే నిజమైన చరిత్ర అని శ్రీశ్రీ అన్నారు .

**II. వ్యాసరూప సమాధానప్రశ్నలు :**

1. దేశచరిత్రలు లోని శ్రీ శ్రీ అభ్యుదయ దృక్పథం లేదా 2. గతచరిత్ర సారాన్ని కవి విశ్లేషించిన విధం లేదా

మనం గొప్పలు చెప్పుకుంటున్న దేశచరిత్రల్లో నిజానికి ఎంతగొప్ప ఉందో మహాకవి శ్రీశ్రీ తమదేశచరిత్రలు

కవితలో నిగ్గుతెల్చారు . నిజానికి ఏ దేశచరిత్రలోనూ గర్వించదగ్గ విషంఏమీ లేదని ఆయనతేల్చి చెప్పారు .

శ్రీశ్రీ నరజాతిచరిత్ర అంతా పరపీడనపరాయణత్వం తోటి , పరస్పర ఆహరణోద్యోగం తోటి , రణరక్తప్రవాహాల తోటి తడిసి పోయిందంటారు.

ఇంకా ధనవంతులు దరిద్రులను కాల్చుకుతినడాల తోటి , బలవంతులు దుర్బలులను బానిసలుగా చేసుకోడాల తోటి నిండిపోయి , పిశాచగణాల సమవాకారంగా, బీభత్సరస ప్రధానంగా కనబడుతుందంటారు

చరిత్ర అంతటా మరణించిన జనసందోహం తత్పలి తంగా చల్లారిన సంసారాలు అసహాయుల ఆహాకారాలు , మూలుగుతున్నాయంటారు

వైషమ్యం , స్వార్థపరత్వం , కౌటిల్యం , ఈర్ష్యలు , స్పర్థలు , మాయలు లాంటి చెడు గుణాలు పెచ్చుపెరిగి చరిత్రగతిని మార్చివేశాయని వాపోయారు శ్రీశ్రీ .

చరిత్రకారులు వీరులని పేర్కొన్న చెంఘీజ్ ఖాన్ , తామర్లేన్ , ఘజనీ ఘోరీ , సికిందర్ లాంటి వాళ్ళను ఒక్కొక్కడు మహాహంతకుడనిఆయనఅంటారు వైకింగులు , శ్వేత హూణులుసిథియన్లు , పిండారీలు, తగ్గులు లాంటి వారు కాలానికి కత్తుల వంతెనకట్టారని అంటారు

చారిత్రిక అంధయుగంలో ఆకలికి, ఆవేశానికి లోనైన మనుష్యులు తెలియని ఏ తీవ్రశక్తులో నడిపిస్తే అంతా తమ ప్రయోజకత్వానికని , తామే భూమికి అధిపతులమని సామ్రాజ్యాలు స్థాపించారు . కృత్రిమ చట్టాలు చేశారు . అలాంటి రాజ్యాలు ఇంకా తీవ్రశక్తులు లేస్తే పేకమేడల్లా కూలిపోయా యంటారు

ఇంతకాలంగా కొనసాగిన బలవంతుల దౌర్జన్యాలు , ధనవంతులపన్నాగాలు ఇకపై సాగవు. ఒక వ్యక్తిని మరొక

వ్యక్తీ , ఒకజాతిని మరొక జాతి పీడించుకుతినడంఇకచెల్లదు . చీనాలో రిక్షావాలా , చెక్ దేశపు గనిపనిమనిషి,ఐర్లాండులో ఓడ కళాసి, హటన్ టాట్ , జూల్యూనీగ్రో ఇలాప్రపంచవ్యాప్తంగా అణగారిన నానా జాతులవారూ ఏకమై తమగొంతుక విని పించి అన్యాలను ఎదుర్కొంటారని శ్రీశ్రీ తనఅభ్యుదయ దృక్పథాన్ని వెల్లడించారు .

చరిత్ర అంటే రాజ్యాలు , యుద్ధాలు , తారీఖులు, దస్తావేజులు , రాణుల ప్రేమ పురాణాలు, ముట్టళ్ళకైన ఖర్చులు, కైఫీయతులు కాదని, నిజమైన చరిత్ర వెలుగులోకి రాకుండా పోయిందని అన్నారు. శ్రీశ్రీ చరిత్రకు సరికొత్త నిర్వచనం ఇచ్చారు . నిజమైన చరిత్ర అంటే చరిత్ర అట్టడుగున కనిపించకుండాపడి ఉన్న కథలన్నీ కావాలని , అవిదాచేస్తే దాగని సత్యాలని చెప్పారు .

చరిత్ర అంటే... నైలునది నాగరికత గొప్పలు కాదు, అక్కడ సామాన్యుడి జీవనం ఎలా ఉండేదో కావాలి . తాజమహల్ నిర్మించిందెవరు అన్నది కాదు, దాని నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలవివరాలు కావాలి . రాజ్యాల దండయాత్రలు కాదు, వాటిలో సామాన్యులు చేసిన సాహసాలు కావాలి . ప్రభువు ఎక్కిన పల్లకి కాదు, దాని మోసిన బోయీలు ఎవరో తెలియాలి .

చరిత్ర అంటే... తక్షశిల , పాటలీపుత్రం , మధ్యధరా సముద్రతీరం, హరప్పా , మొహంజొదారో , క్రో -మాన్యాన్ గుహ ముఖాల్లో మానవనాగరికత వికాసం ఎలా జరిగిందో తెలియాలి . ఏదేశం ఏకాలంలో ఏమి సాధించింది. అక్కడ ఏశిల్పం , ఏసాహిత్యం , ఏశాస్త్రం , ఏ సంగీతంఎలా ప్రగతి సాధించిందో బయటపడాలి. ఈ మానవప్రయాణం ఏ స్వప్నం కోసం , ఏ విజయం కోసం అర్రులు చాస్తూ వచ్చిందో తెలియాలి . అదే నిజమైన చరిత్ర అనిశ్రీశ్రీ అన్నారు .

**III. సదర్భసహితవ్యాఖ్యలు :**

| |
|---|
| 1. ఏదేశ చరిత్ర చూసినాఏమున్నది |

**పరిచయం** ఈ వాక్యం మహాకవి శ్రీశ్రీ రచించిన "మహాప్రస్థానం" లోని "దేశచరిత్రలు" అనే కవితలోనిది .

**సందర్భం** మనంగొప్పలు చెప్పుకుంటున్న దేశచరిత్రల్లో గర్వించదగ్గ విషంఏమీ లేదని చెబుతూ కవి ఈ మాటలన్నారు .

**వివరణ** నరజాతిచరిత్ర అంతా పరపీడన పరాయణత్వం తోటి , పరస్పర ఆహరణోద్యోగం తోటి , రణరక్తప్రవాహాల తోటి తడిసి పోయింది . మనం గర్వంగా చెప్పుకోదగ్గ విషయాలు దేశచరిత్రల్లో
ఏమీ లేవని భావం.

2. గతమంతాతడిసె రక్తమున . లేదా కాకుంటే

**పరిచయం**

**సందర్భం** మనంగొప్పలు చెప్పుకుంటున్న దేశచరిత్రల్లో గర్వించదగ్గ విషంఏమీ లేదని చెబుతూ కవి ఈ మాటలన్నారు .

**వివరణ**ఈ భూమి మీదయుద్ధం జరగనిప్రాణాలు పోని చోటు లేదు. అలాగతమంతారక్తంతో తడిసిపోయింది . ఒకవేళ రక్తంతో కాకుంటే కన్నీళ్ళతో అయినాతడిసిందనిభావం.

3. ఒక్కొక్కడు మహాహంతకుడు

**పరిచయం**

**సందర్భం** చరిత్రలో వీరులుగా పేరుగాంచిన వారు నిజానికి హంతకులనిచెబుతూ కవి ఈ మాటలన్నాడు .

**వివరణ** చరిత్రకారులు వీరులని పేర్కొన్న చెంఘీజ్ ఖాన్ , తామర్లేన్ , ఘజనీ ఘోరీ , సికిందర్ లాంటి వాళ్ళు ఒక్కొక్కడు తాము చేసిన యుద్ధాల్లో కొన్ని లక్షలమందిని చంపి పొట్టన బెట్టుకున్నారు . కాబట్టి వాళ్ళు వీరులు కారని మహాహంతకులనిభావం.

4. ఇంకానా! ఇకపై చెల్లవు .

**పరిచయం**

**సందర్భం** చరిత్రలో చిరకాలంజరిగిన మోసాన్ని గూర్చి కవి ఈ మాటలన్నాడు .

**వివరణ**ఇంతకాలంగాబలవంతులుదౌర్జన్యాలు చేసి బలహీనులను బానిసలుగా చేసుకున్నారు . ధనవంతులుషున్నాగాలు పన్ని పేదలను దోచుకుతిన్నారు . అలా ఇన్నాళ్ళుగా కొన సాగిన బలవంతుల దౌర్జన్యాలు , ధనవంతులుషున్నాగాలు ఇకపై సాగవని, అణగారిన వర్గాలన్నీ చైతన్యవంతమై తిరుగుబాటు చేస్తాయని భావం.

5. ఇవికావోయ్ చరిత్రసారం . లేదా

**పరిచయం**

**సందర్భం** చరిత్రకు సరికొత్త నిర్వచనం ఇస్తూ కవి ఈ మాటలు అన్నాడు .

**వివరణ** చరిత్ర అంటే రాజ్యాలు , యుద్ధాలు , తారీఖులు, దస్తావేజులు , రాణుల ప్రేమ పురాణాలు, ముట్టళ్ళకైన ఖర్చులు, కైఫీయతులు కాదు. నిజమైన చరిత్ర వెలుగులోకి రాకుండా పోయింది . నిజమైన చరిత్ర అంటే చరిత్ర అట్టడుగున కనిపించకుండాపడి ఉన్న కథలన్నీ కావాలని , అవి దాచేస్తే దాగని సత్యాలని భావం.

6. రాళ్ళెత్తిన కూలిలెవ్వరు ? లేదా అది మోసిన బోయీలెవ్వరు ?

**పరిచయం**

**సందర్భం** చరిత్రకు సరికొత్త నిర్వచనం ఇస్తూ కవి ఈ మాటలు అన్నాడు .

**వివరణ** చరిత్ర అంటే... తాజమహల్ నిర్మించిందెవరు అన్నది కాదు, దాని నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలవివరాలు కావాలి . రాజ్యాల దండయాత్రలు కాదు, వాటిలో సామాన్యులు చేసిన సాహసాలు కావాలి . ప్రభువు ఎక్కిన పల్లకి కాదు, దాని మోసిన బోయీలు ఎవరో తెలియాలి . ఆయా నాగరికతలుఎలా వికసించాయో తెలియాలని భావ.

భీభత్సం =బీభత్సం ; దుర్బలులు=దుర్బలులు; స్తలం =స్థలం

కౌఠిల్యం =కౌటిల్యం ; క్రుత్రిమం =కృత్రిమం; సంగర్షణ =సంఘర్షణ

# 5. చింతలతోపు

## I. సంగ్రహ సమాధానప్రశ్నలు :

**1. చింతలతోపు కథలోని మానవ మనస్తత్వాన్ని**

చింతలతోపు కథలో మానవ మనస్తత్వాలను ఇలా వివరించవచ్చు.

**వరదయ్య :** వరదయ్య ఒక సాధారణ రైతు . అందరిలాగే పొగాకు పంట వేసి అప్పులన్నీ తీర్చి సంసారం చక్కబెట్టుకోవాలని ఆశ. వానలు, మార్కెట్టు రేట్లు , రాజకీయనాయకులు అందరిచేతా మోసపోయి చివరికి వ్యవసాయాన్ని విస్తరించాలని తాతలనాటి చింతలతోపును కూడా నరుక్కున్న అమాయకుడు

**రామారావు :** ఆదర్శభావాలు గల యువకుడు. తమ గ్రామానికి సాగర్ నీళ్ళు , మంచి మార్కెట్ రెట్లు తెప్పించాలని ఉద్యమాలు చేయించే అభ్యుదవాది .

**సీతారామయ్య :** కోమటి సీతారామయ్య లౌక్యంగా లాభాలు పొందుతూ, రైతుల క్షేమం కోరి మంచి సలహాలు ఇస్తాడు .

**కమలమ్మ:** కమలమ్మ వరదయ్య భార్య . భర్తతో కష్టసుఖాలు పంచుకునే ఉత్తమ ఇల్లాలు .

**కృష్ణమూర్తి :** చిన్న పిల్లవాడు . కుటుంబంతో, స్నేహితులతో పరి సరాలతో అనుబంధం పెంచుకున్న సున్నిత స్వభావి .

**ఇతరులు:** ఈ కథలో ఇంకపల్లె వాతావరణానికి ప్రతిరూపాలైన కృష్ణమూర్తి స్నేహితులు నరసయ్య , నారాయణ, ఉయ్యాలలూగే ఆడపిల్లలు , వరదయ్య తోడల్లుడు తిరపతిరావు, మరదలు కుమారి, మరికొంతమంది గ్రామ పెద్దలు , రాజకీయ నాయకులు కనబడతారు

## 2. చింతలతోపు కథలో పొగాకు పంటను

చింతలతోపు కథలో పొగాకు పంట వర్ణన కనబడుతుంది వరదయ్య అనంతారం నుంచి పొగనారు తెచ్చాడు . ఆ బుల్లి బుల్లి మొక్కల్ని చూస్తే అతని కొడుకు కృష్ణమూర్తికి కుశాల అయింది తనూ పొగనాట్లకు పోయి పాదులకు నీళ్ళు పొయ్యటం లాంటి పనులు చేశాడు .

నాటిన పొగాకునారులో కొన్ని చనిపోయాయి . వాటి స్థానంలో మళ్ళీ నాట్లు వేశారు . వరదయ్య కొడుకు కృష్ణమూర్తి పెరిగి కలకలలాడుతున్న పొగాకులను తాకితే వాటి జిడ్డు అతని చేతులకు అంటుకుంటుంది

పొగాకు చేలో పడినకలుపును వరదయ్య భార్య కమలమ్మ కూలీలతోబాటు తీసేసింది . ఎక్కువమంది రైతులు తెగుళ్లకు తట్టుకుంటుందని హెచ్ .ఆర్ రకమే వేసినారు . కానీ మార్గశిరంలో వానలకు మచ్చతెగులు వచ్చి పంటలు దెబ్బ తిన్నాయి . రంగు నాణ్యం తగ్గిపోయినాయి .

చలికాలంలో పొగతోటలు ఎక్కొచ్చాయి . సీజన్ మొద లు కావడంతో బ్యారన్ , బ్యాగులు , కొట్టాలు , పొయ్యి , బొగ్గు , కూలీలు వ్యాపారులు , కంపెనీల తాకిళ్ళతో సందడిగా గడిచింది. కానీ పంటనాణ్యం తగ్గడం , మార్కెట్ మోసాల వల్ల రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడం బాధాకరం.

## 3. కృష్ణమూర్తికి చింతలతోపుతో గలఅనుబంధ

వీరయ్యగారి చింతలతోపు చాలా పాతది. ఆ తోపంటే వీరయ్య మునిమనుమడు వరదయ్య కొడుకూ అయిన కృష్ణ మూర్తికి చాలా ఇష్టం .

కృష్ణమూర్తి బడిలేనప్పుడు సావాసగాళ్ళతో తోపులోకి చేరతాడు. సన్నటి చిటారుకొమ్మకు కూడా తను పాకగలడు ఏ చెట్టుకు కాయలు ఎక్కువ ఉంటాయో, దేన్నెక్కడం తేలికో తనకు బాగా తెలుసు. చెట్టు తమరలో కూచొని, పళ్ళు పులిసిపోయేలా చింతకాయలుతింటూ, దారెంబడి పోయే వాళ్ళని దడిపించడం వాడికి మా ఇష్టం . స్నేహితులతో కలిసి ముదురుకాయలుకోసి సీతారామయ్య అంగట్లో ఇచ్చి , ఆయన జేబి నిండా పోసే సెనగపప్పు తింటారు.

చింతలతోపులో ఉండ్రాళ్ళతద్దెకు ఉయ్యాలలూగే ఆడ పిల్లలను తనూ ఊపేవాడు. రాత్రిళ్ళు తోపులో దెయ్యాలు ఉంటాయనిస్నేహితుడు నరసయ్య చెబుతుంటే భయమేసేది .

ఒకసారి స్నేహితులతో తోపులో ఆడుకుంటూ ఉండగా పుల్లయ్య శవం ఒక చింతకొమ్మకు వేలాడుతూ కనబడింది పుల్లయ్య మనుమడునారాయణ ఏడుస్తుంటే తనూఏడ్చే శాడు. ఆరాత్రి తనకుజ్వరం వచ్చేసింది .

తనతండ్రి వరదయ్య చింతలతోపు కొట్టేపిస్తుంటే తనకుచాలా బాధ అయింది పై చదువులకుతుళ్ళూరు పోతున్న కృష్ణమూర్తి బండి చెరువు కట్ట మీదుగా పోతు న్నపుడు వెనక్కి తిరిగి చూశాడు. చింతలతోపు కనబళ్ళేదు . అంతా వెలితిగా అనిపించింది " కిట్టమ్మా ! గోపాలబాల కిట్టమ్మా !" అని ఎవరో ఎగతాళి చేసినట్లయింది . వాడి కళ్ళ వెంబడి గిరగిర నీళ్ళు తిరిగాయి .

## 4. . చింతలతోపుకథలోవర్ణింపబడిన పిల్లల

చింతలతోపులో ఉండ్రాళ్ళతద్దెకు ఆడపిల్లలు ఉయ్యాల ఊగుతారు మగపిల్లలు ఊపుతారు. తెలివైన ఆడపిల్లలు పావడాలు తొలగిపోకుండా జాగ్రత్త పడతారు ఆ తెలివిలేని వాళ్ళు ఎగతాళికి గురై బుంగమూతిపెట్టుకుంటారు .

కృష్ణమూర్తి చింతలతోపులో స్నేతులతో కలసి కోతి కొమ్మచ్చి ఆడతాడు పంటలెయ్యగా రాముడుదొంగయ్యాడు . కాలికింద పుల్ల విసిరినారు . దాన్ని రాముడు తెచ్చేలోపు అందరూచెట్టెక్కేశారు . ఒక్కొక్కడు కొనకొమ్మల్లోంచి దూకి రాముడికి దొరక్కుండా చిట్టుకింద గిరిలోకి పరిగెత్తినారు .

కృష్ణమూర్తి చింతలతోపులో స్నేతులతో గోలీలాట కూడా ఆడతాడు దాంట్లో అతనికి మంచి గురి ఉంది సాయం కాలానికి జేబీ గోలీలతో నిండిపోవాల్సిందే . అక్కడ వాళ్ళు వాలింకి ఆటకూడా ఆడతారు

**II. వ్యాసరూప సమాధానప్రశ్నలు :**

1. చింతలతోపు కథలోని ఇతివృత్తాన్ని వివరించండి లేదా

పాపినేని శివశంకర్ గారు రచించినమా పాఠ్యభాగ మైన చింతలతోపు కథ గ్రామీణ జీవితాలకు, సామాన్య రైతుల జీవితాల్లోని కష్టనష్టాలకు అద్దం పడుతుంది వరదయ్య పాత్ర మూలంగా రచయితరైతుల కష్టనష్టాలను వాస్తవంగా కథనంచేశారు .

**<u>ప్రకృతితో ఆత్మీయతలు:</u>** వరదయ్యకు తాతల కాలం నాటి చింతలతోపు ఒకటి ఉంటుంది అది అంటే అతని కొడుకు కృష్ణమూర్తికి చాలా ఇష్టం . అక్కడ అట్లతద్దెకు ఆడపిల్లలు ఉయ్యాల ఊగడం చాల ఉత్సాహంగా , కులాసాగా సాగేది . కృష్ణమూర్తి చింతచెట్లు ఎక్కి పళ్ళు పులిసిపోయేలా కాయలు తినేవాడు . చెట్టు తమర్లో కూచొని

దారివెంబడి పోయేవారిని దడిపించేవాడు. అక్కడే సావాస గాళ్ళతో కలసిగోలీలు. కోతికొమ్మచ్చి లాంటి ఆటలుఆడుకునే వాడు.

**సంక్లిష్ట వ్యక్తిత్వాలు :** వరదయ్య పెసరపంట చేతికొస్తుంది . కోమటి సీతారామయ్య ఆ పెసరగింజలు తనకివ్వమంటాడు. కానీ వరదయ్యకు అది ఇష్టం లేదు. ఎందుకంటే సీతారామయ్య రేటు తక్కువ చేస్తాడు . తనఅంగడిపద్దు జమ కట్టుకుంటాడు . పోను తనకు మళ్ళీ పంటవెయ్యడానికి ఏమీ మిగలదుఅందుకనివరదయ్య బదులియ్యడు . అది గమనించినసీతా రామయ్య కూడా వరదయ్యను బలవంతపెట్టడు . వరదయ్య అందరిలాగే ఆశకు పోయి పొగాకుపంట వేసి బాగా డబ్బు సంపాదించి అప్పులు తీర్చేస్తానంటాడు . కానీ అతని భార్య కమలమ్మ, మేలుగోరే సీతారామయ్యలు పొగాకుపంట వద్దని అదివేసి చాలా మందినష్టపోయారని చెబుతారు.

**రైతుబాంధవులుఉద్యమాలు :**సూరయ్యమ కొడుకు రామారావు తమ గ్రామానికి సాగర్ నీళ్ళు తీసుకురావాలని బడా వ్యాపారులు , కంపెనీల మోసాలు అరికట్టి పండించిన పంటకు గిట్టుబాటుధరలు వచ్చేలా చెయ్యాలని రైతుల వద్ద సంతకాలు సేకరించి, సమావేశాలకు వెళ్ళడం , మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వడం, అవసరమైతే రైతులను ఏకం చేసి ఉద్యమాలు జరపడంలాంటివి చేస్తుంటాడు .

**వాణిజ్య పంటలుమార్కెట్ మోసాలు** వరదయ్య పొగాకుపంట వెయ్యనే వేశాడు . ఎక్కువమంది రైతులు తెగుళ్లకు తట్టు కుంటుందని హెచ్ .ఆర్ రకమే వేసినారు . కానీ మార్గశిరంలో వానలకు మచ్చతెగులు వచ్చి పంటలుదెబ్బ తిన్నాయి . రంగు నాణ్యం తగ్గిపోయాయి . చలికాలంలో పొగతోటలు ఎక్కొచ్చాయి . సీజన్ మొదలుకావడంతో బ్యారన్ , బ్యాగులు , కొట్టాలు , పొయ్యి , బొగ్గు , కూలీలు వ్యాపారులు , కంపెనీల తాకిళ్ళతో సందడిగా గడిచింది. కానీ పంట నాణ్యం తగ్గడం ,

మార్కెట్ మోసాల వల్ల ఎన్ని ఉద్యమాలు , పోరాటాలు చేసినా
రైతులకు గిట్టుబాటు ధరదక్కలేదు . ఆనకఎస్ .టి .సి. రంగంలోకి దిగినా అప్పటికే రైతులు అప్పుల బాధలు తట్టుకోలేక అయినకాడికి అమ్మేసుకున్నారు . పొగాకు మొత్తం అమ్మగా వరదయ్యకు ఎనిమిదివేలు వచ్చింది . అది అప్పులకే చాలకదిగులు పడ్డాడు .

**రైతు ఆత్మహత్యలు :** బాకీలు తీర్చలేక నారాయణవాళ్ళ నాన్న పుల్లయ్య చింతలతోపులో ఉరివేసుకుని చనిపోయాడు. ఊరంతా ఉలిక్కి పడింది. పుల్లయ్యను ప్రభుత్వమే చంపేసిందని రామారావు కృష్ణమూర్తికి వివరించాడు.

**ఎన్నికలగోల:** ఎన్నికలు వచ్చాయి . ప్రచారానికి గ్రామం వచ్చిన క్యాండిడేట్లు , మంత్రులు రైతులు సాగర్ నీళ్ళు , గిట్టుబాటు ధరలపైన అడిగిన ప్రశ్నలకు సమాధానాలు లేక నీళ్ళు నమిలారు రాజకీయ నాయకులు పొగాకు కంపెనీలు కుమ్మక్కై రైతుల్ని మోసం చేసిన విషయంవెల్లడించి , మీకు ఎందుకుఓటెయ్యాలని జనాలు నిలదీశారు. వరదయ్య లాంటి మోసపడ్డ రైతులు నాయకుల్ని గ్రామాలకు రాకుండా తరిమి వేశారు .

**అశాంతితో అనాలోచిత చర్యలు** : పంటలు చీడపీడలు వానలు మార్కెట్ మోసాల వల్ల తన ఆశలు అడియాసలు కాగా వ్యవసాయం విస్తరించి సంపాదించేయాలని వరదయ్యకు అత్యాస పట్టుకుంది . ఎవరువద్దన్నా వినకుండా తాతల కాలం నాటి చింతలతోపునుకొట్టేయించాడు .

**గాయపడ్డ హృదయాలు** వరదయ్య చింతలతోపు కొట్టివేయించే సరికి అతనిభార్య కమలమ్మ , అతనికొడుకు కృష్ణమూర్తి చాలా బాధపడ్డారు . పై చదువులకతుళ్ళూరు పోతున్న కృష్ణమూర్తి బండిచెరువుకట్ట మీదుగా పోతున్నపుడు వెనక్కి తిరిగి చూశాడు. చింతలతోపు కనబళ్ళేదు . అంతా వెలితిగా అని పించింది.

“కిట్టమ్మా ! గోపాలబాల కిట్టమ్మా !” అని ఎవరో ఎగతాళి చేసినట్లయింది . వాడి కళ్ళు వెంబడి గిరగిర నీళ్ళు తిరిగాయి .

**ముగింపు** ఇలా రచయితచింతలతోపు కథలో గ్రామీణ జీవి తాలను సామాన్యరైతుల జీవితాల్లోని కష్టనష్టాలని గుండెలకు హత్తుకునేలా రాసి రైతుల్ని చైతన్యపరిచారు .

# 6. సావుకూడు

## I. సంగ్రహ సమాధానప్రశ్నలు :

1. సావుకూడుకథలో కరువునుచిత్రించండి .

కరువుజిల్లా అనంతపురంలోఎండ అగ్గి కురుస్తున్నది . గాలి తోలదు. ఆకు అల్లాడదు . ఉడుకుఉమ్మరిస్తున్నది . ఒక మోడం లేదు. ఒక వాన చినుకు లేదు. జనాలు ఇంతగంజో, కలబంద గడ్డలో తిని బతికేస్తారు . కానీ పశువులకుఆరికేం దుకుఒక్క గడ్డిపోచ కూడా లేదు.

కరువు తాండవిస్తున్నది . ఇంటా బయటా ఎండా, సెగా . కంపచెట్లలో కీచుర్లు గుమ్మని వాలుతున్నాయి . ఆకాశంలో

గద్ద లాడుతున్నాయి . చెరువులు ఎండి కొక్కులు బొక్కలు పెడు తున్నాయి .

జనాలకు పనుల్లేవు . సంగటికి నూకల్లేవు . ఆకలికి ఈలగరుసుకునిఎల్లమ్మ కట్టమీద పులీ-మేక ఆడుతున్నారు. పిల్లలకు చొక్కా ఉంటే నిక్కర లేదు. నిక్కర ఉంటే చొక్కా లేదు. ఆడోళ్ళు చంకల్లో , రొమ్ము మీదా చిరిగిన రవికల్నే సిగ్గులే కుండా కట్టుకున్నారు . అక్కడ ఆకు వక్కలకు, గడ్డి మోపులకుమానంఅమ్ముకుంటారు . ఎవరికీ కడుపునిండదు

ఏళ్ల తరబడి వానల్లేవు . పంటల్లేవు . ఎదిగిన పిల్లలకి పెళ్ళిళ్ళు లేవు . పనిపాటలు లేక జనాలు చెట్ల కిందా , బండి నొగల మీదా ఎక్కడ బడితే అక్కడ మోకాళ్ళు డొక్కల్లోకి ముడుచుకుని నిద్రపోతున్నారు . జబ్బులు వస్తే చూపించు కునేందుకుచివరికి చస్తే కర్మకాండకు కూడా గతిలేని బతుకులు ఇలాఉంటుందిఅక్కడ కరువు

2. పెద్దప్పయ్య తిండిపుష్టిని గురించి రాయండి. లేదా

పెద్దప్పయ్య వయసులోఉన్నపుడు మంచితిండిపుష్టి గలవాడుదాని వెనుక ఒకకథఉంది కొత్తగా పెళ్ళయ్యి భార్య కాపురానికి వచ్చింది . తొలిరోజు ఆయనకురెండు ముద్దలు , నాకు ఒకముద్ద అనిమూడుముద్దలు కెలికింది . మొగుని మూకిట్లో ఒక ముద్ద పెట్టి ఊరిబిండి వేసింది . తినేశాడు . ఇంకో ముద్ద పెట్టింది . తినేశాడు . ఇంక చెయ్యి కడుక్కుని లేస్తాడు అనుకుందిలెయ్యాలా . ఉన్న ముద్దా పెట్టింది . అదీతినేశాడు . తనుపస్తు పడుకుంది

రెండోరోజు తనకుమూడు నాకు ఒకటి అని నాలుగుముద్దలు కెలికింది . నాలుగూ తనే తినేశాడు . ఆమె ఆ రోజూ పస్తు పడుకున్నది. పెళ్ళానికి కడుపు మండి మూడోరోజు కెలి కిన ఆరు ముద్దలూ తనే తినేశాడు .

పెద్దప్పయ్య పెళ్ళాము ముక్కు సీత్తా పుట్టింటికి పోయి బానకడుపోనికి ఇచ్చి చేశారని ఏడవబట్టింది . పెద్దమనుషులు పెద్దప్పయ్యను పిలిపించి "ఏమిరా! పెండ్లానికి కూడెయ్యవంట ?" అనినిలదీసినారు.

" నాకేం తెలుసు. అదే వండె. అదే పెట్టె . దాన్నెవరు తినొద్దన్నారు " అని గుడ్లు వెల్లబెట్టాడు ." నన్ను తినొద్దు అన్లేదు . మూకిట్లో ఎంత పెట్టితే అంతా తినడమేనా?" అని ఆమె అన్నది. పెద్దమనుషుల్లో ఒకాయన అందుకుని తినేముందు పెళ్ళాంకు ఉందా లేదా చూసుకోవద్దా ? కరువులో పుట్టినవాళ్ళం ఎంత తింటే మాత్రం మన కడుపులు నిండుతాయి? కడుపు ఎండ గట్టుకోలేనోడివి పెండ్లాం , బిడ్డల్ని ఎట్లా సాకుతావు? అని హితవు పలికినాడు. అలాంటిది మరి పెద్దప్పయ్య తిండిపుష్టి .

### 3. పెద్దప్పయ్య అంత్యక్రియలు జరిగిన

పెద్దప్పయ్య కూర కూరని కలవరించి చనిపోయాడు. కొడుకులు, కోడళ్ళు , మనవళ్ళు బంధువులు ఊరిజనం అంతా వచ్చారు . ఆడవాళ్ళు ఏడవబట్టినారు . తన ముగ్గురు కొడుకులు తండ్రిని సాగనంపే ఏర్పాట్లకు పూనుకున్నారు.

కుంకుమపసుపు ఊదుకడ్డీలు , సాంబ్రాని పాడె కావాలి . అన్నీ అందరూ తెప్పించమనేవాళ్ళే . తెప్పించేవాళ్ళు , జేబిలోంచి దుడ్లు బయటికి తీసేవాళ్ళు ఒక్కరూ లేరు. అన్నదమ్ములు ఒకరుతెస్తార్లే అని ఒకరుతప్పించుకు తిరుగు తున్నారు . చివరకు ఊరి పెద్దలు విషయం గ్రహించి అన్నదమ్ములు ముగ్గుర్నీ పిలిచి ఖర్చు ముగ్గురూ భరించేటట్లు ఒప్పించారు .

తప్పెట కొట్టేవాళ్ళు అడిగిన రేటు భరించలేక అది లేక పోతేనేమని అనుకున్నారు. కానీ ఊరివాళ్ళు "కన్న తండ్రి చస్తే తప్పెట కూడా కొట్టించలేరా ? ఛీ! గతిలేని నా

కొడకల్లారా ! పెద్దప్పయ్యకు పుట్టినారా ? ఇంకా ఎవరికన్నా పుట్టినారా ?" అని తిట్టే సరికి చేసేదిలేక తప్పెటకు ఒప్పుకున్నారు .

గుంత తవ్వేవాళ్ళు ముప్పై ఐదు రూపాయలు అడిగినప్పుడు పెద్దప్పయ్య కొడుకులకు వాళ్ళ కష్టాలన్నీ గుర్తుకు వచ్చాయి . ఎలాగో చీకటి పడేసరికి పీనుగనుపూడ్చి , ఇంటిదారి పట్టారు . ఇలా కరువుసీమలో కర్మక్రియలు కూడా చెయ్యడానికి గతిలేని పరిస్థితుల్ని రచయితసమర్థవంతంగా వర్ణించారు .

### 4. పెద్దప్పయ్య దినముజరిగిన విధం

పెద్దప్పయ్య పోయాక పదకొండవనాడుదినం జరపమని పూజారి చెప్పాడు . పెద్దప్పయ్య పెద్దకొడుకు మారెప్ప మందకుపోయి మేసిన గొర్రెను కొనలేక ఒక బక్క గొర్రెను పట్టు కొచ్చాడు .

పదో దినం అర్ధరాత్రి గొర్రెను కోసి వండసాగినారు వాసనకు నోళ్ళు ఊరసాగినాయి. పిల్లలు , పెద్దలు పొయ్యి చుట్టూ మూగినారు. ఆ ఊర్లో కూర మొగం చూసి ఆర్నెల్లాయ .

పిండం పెట్టి , ముసల్దాని బొట్టు తుడిపి ముండ మోయించారు. ఇంకఅన్నానికి కూచున్నారు. వరెన్నం తిని, ఎముకలు కొరికి ఎన్నాళ్ళయిందో .నమిల్తే ఆలస్యం అవుతుందనిదవడలు కూడా కదిలించకుండాపడ్డించింది వడ్డించి నట్లే మింగినారు. పిల్లలు ఇంక సాలు మొర్రో అంటున్నా కొట్టి మరీ తినిపించారు.

బాపనయ్యకు కానుకలు పెట్టి నీళ్ళు చల్లించ కున్నారు . మూడో రోజు పెద్దప్పయ్య భార్య ఏడవబట్టింది . ఆమె ఏడ్చింది భర్త పోయినందుకు కాదు. కొడుకులు మంచి మాంసం కూర ఊరందరికీ పెట్టి తనకుఒట్టి

నీళ్ళపులుసు వేసినందుకు ఇలా కరువు బతుకుల్లోని విషాదానికి హాస్యం పూసి రుచి చూపించాడు రచయిత

**II. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు :**

1. సావుకూడు కథను తెలియజేయండి . లేదా
సావుకూడు కథలోని గ్రామీణ జీవిత చిత్రణను

బండి నారాయణస్వామి తమ సావుకూడు కథలో అనంతపురం జిల్లాలో నిత్యం తాండవించే కరువు పరిస్థితుల్ని , కరువు బతుకుల్ని చక్కగా కథనం చేశారు .

పెద్దప్పయ్య చావు దగ్గర పడి నీరసించిపోయాడు . వయసులో ఉన్నపుడు తను చాలా తిండిపుష్టి గలిగినవాడు. తన ముగ్గురు కొడుకుల్ని పెంచి, పెద్దచేసి పెళ్ళిళ్ళు చేశాడు . వాళ్ళు వేరుపోయినప్పుడు అప్పు లేకుండా ఆస్తి పంచిపెట్టాడు . పెద్దప్పయ్య , అతని భార్య చిన్నకొడుకు వద్ద ఉండడం వల్ల అతనికి ఐదెకరాలు అదనంగా ఇచ్చారు .

వానల్లేక కరువు తాండవిస్తున్నది . పెద్దప్పయ్య దగ్గర పడి మంచమెక్కాడు . వైద్యానికి డబ్బుల్లేవు . తండ్రి మంచం ఎక్కాడని తెలిసి పెద్దకొడుకు మారెప్ప వచ్చాడు . పెద్దప్పయ్య తనకు కల్లు తాగాలని ఉందని నాలుగు రూపాయలు ఇమ్మని అడిగినాడు. తనవద్ద చాలినంత లేకున్నా కన్న తండ్రి కడసారి అడిగినాడని మారెప్ప తెంపు చేసి నాలుగు రూపాయలు ఇచ్చాడు . ఆ విషయం తెలిసి అతని భార్య నానా రాద్ధాంతం చేసింది . కల్లు తాగి చస్తాడనుకున్న పెద్దప్పయ్య లేచి కూచు న్నాడు . " మనం చావాల్సిందే గాని ముసిలోడు చావడు రోయ్ " అని ఊరి వాళ్ళంతా నవ్వుకున్నారు .

వారం రోజుల తర్వాత పెద్దప్పయ్య మళ్ళీ మంచం ఎక్కాడు . ఈ సారి తండ్రిని చూడ్డానికి రెండో కొడుకు నాగన్న వచ్చాడు . పెద్దప్పయ్యకు కడసారిగా మాంసం కూర తినాలని ఉంది నాగన్న భార్య తనకు మొగుడు వైద్యం చెయ్యించ

లేదని, ఎవడో చెయ్యిస్తానంటే వాడితో లేచిపోయింది . అతని పెద్ద కూతురే వండిపెడుతున్నది. అతన్ని అడగాలంటే బుద్ధి పుట్టలేదు . కానీ కోరిక చావక ఎలాగో అడిగేశాడు . కరువు వల్ల ఆ ఊరి వాళ్ళు మాంసంతిని ఆర్నెల్లాయ . అదే విషయంచెప్పి నాగన్న తండ్రి మొగం చూల్లేక వెళ్ళిపోయాడు .

పెద్దప్పయ్య కూర కూరని కలవరించి చనిపోయాడు. కొడుకులు, కోడళ్ళు , మనవళ్ళు బంధువులు ఊరిజనం అంతా వచ్చారు . ఆడవాళ్ళు ఏడవబట్టినారు . తనముగ్గురు కొడుకులు తండ్రిని సాగనంపే ఏర్పాట్లకు పూనుకున్నారు.

కుంకుమపసుపు ఊదుకడ్డీలు , సాంబ్రాని పాడె కావాలి . అన్నీ అందరూ తెప్పించమనేవాళ్ళే . తెప్పించేవాళ్ళు , జేబిలోంచి దుడ్లు బయటికి తీసేవాళ్ళు ఒక్కరూ లేరు. అన్న దమ్ములు ఒకరు తెస్తార్లే అని ఒకరు తప్పించుకు తిరుగు తున్నారు . చివరకు ఊరి పెద్దలు విషయం గ్రహించి అన్న దమ్ములు ముగ్గుర్నీ పిలిచి ఖర్చు ముగ్గురూ భరించేటట్లు ఒప్పించారు .

తప్పెట కొట్టేవాళ్ళు అడిగిన రేటు భరించలేక అది లేక పొతేనేమని అనుకున్నారు. కానీ ఊరివాళ్ళు “కన్న తండ్రి చస్తే తప్పెట కూడా కొట్టించలేరా ? ఛూ! గతిలేని నా కొడకల్లారా ! పెద్దప్పయ్యకు పుట్టినారా ? ఇంకా ఎవరికన్నా పుట్టినారా ?” అని తిట్టే సరికి చేసేదిలేక తప్పెటకు ఒప్పుకున్నారు .

గుంత తవ్వేవాళ్ళు ముప్పై ఐదు రూపాయలు అడిగి నప్పుడు పెద్దప్పయ్య కొడుకులకు వాళ్ళ కష్టాలన్నీ గుర్తుకు వచ్చాయి . ఎలాగో చీకటి పడేసరికి పీనుగను పూడ్చి , ఇంటిదారి పట్టారు . దారిలో ఆంజనేయస్వామి గుడివద్ద పూజారిని అడగ్గా పదకొండవనాడుదినంజరపమనిచెప్పాడు .

పెద్దప్పయ్య పెద్దకొడుకు మారెప్ప మందకుపోయి మేసిన గొర్రెను కొనలేక ఒకబక్క గొర్రెను పట్టు కొచ్చాడు .

పదో దినం అర్ధరాత్రి గొర్రెను కోసి వండసాగినారు వాసనకు నోళ్ళు ఊరసాగినాయి. పిల్లలు , పెద్దలు పొయ్యి చుట్టూ మూగినారు. చెవి గూబలుగుండెకాయలు కాల్చుకు తిన్నారు .

పిండం పెట్టి , ముసల్దాని బొట్టు తుడిపి ముండ మోయించారు. ఇంకఅన్నానికి కూచున్నారు. వరెన్నం తిని, ఎముకలు కొరికి ఎన్నాళ్ళయిందో . నమిల్తే ఆలస్యం అవుతుందనిదవడలు కూడా కదిలించకుండా వడ్డించింది వడ్డించి నట్లే మింగబట్టినారు . పిల్లలు ఇంక సాలు మొర్రో అంటున్నా కొట్టి మరీ తినిపించారు.

బాపనయ్యకు కానుకలు పెట్టి నీళ్ళు చల్లించ కున్నారు . మూడో రోజు పెద్దప్పయ్య భార్య ఏడవబట్టింది . తమ తండ్రి పోయినందుకు ఏడుస్తున్నదని అనుకొని చిన్న కొడుకు “ పోయినోళ్ళు వాస్తారా ? ఎందుకేడుస్తావు ” అని మందలించాడుఅందుకామె “ లే , సన్న నా కొడకా ! మూన్నార్లు పెట్టి గొర్రిని కోస్తిరి . ఊర్లోటోల్లంతా బాగా తినిపోయిరి . మీరు తునకలుతిని నా మొగానికి నీల్లు కలిపిన పులుసుపోస్తిరి . మీ కడుపులుదొక్కా ! మీ ముండలు మొయ్యా !” అని శాపనార్థాలు పెడతా ఏడవబట్టింది . ఇలా కరువు బతుకుల్లోని విషాదానికి హాస్యం పూసి నవ్వుతూ కన్నీరు పెట్టేలా చేశాడు రచయిత

# సంధికార్యాలు

## I. సంగ్రహ సమాధానప్రశ్నలు :

**1. ఏవైనా రెండు ఆగమసంధులనుసూత్ర్యలక్షణాలతో వివరించండి**

లేదా

**నిర్వచనం** సంధిగత పదాల మధ్య ఒక అక్షరం మిత్రునిలాగా వచ్చి చేరడాన్ని ఆగమం అంటారు తెలుగులో రుగాగమసంధి టుగాగమసంధి వీటికి ఉదాహరణలు వీటిని కింది విధంగా వివ రించవచ్చు.

**రుగాగమసంధి**

**సూత్రం -1:** కర్మధారయ సమాసంలో పేదాది శబ్దాలకు " ఆలు" శబ్దం పరమైనప్పుడు రుగాగమం వస్తుంది .

ఉదా: పేద+ఆలు- పేద+ర్ +ఆలు= పేదరాలు

జవ+ఆలు- జవ+ర్ +ఆలు=జవరాలు

**సూత్రం -2:** కర్మధారయ సమాసంలో తత్సమ శబ్దాలకు " ఆలు" శబ్దం పరమైనప్పుడు అత్వానికి ఉత్వం, రుగాగమం వస్తాయి .

ఉదా: ధీర+ఆలు- ధీర+ఉ+ర్ +ఆలు=ధీరురాలు

వీర+ఆలు- వీర+ఉ+ర్ +ఆలు=వీరురాలు

**టుగాగమసంధి**

**సూత్రం -1:** కర్మధారయ సమాసంలో ఉత్వానికి అచ్చు పరమైన ప్పుడు టుగాగమం వస్తుంది .

ఉదా: కఱకు+అమ్ము - కఱకు+ట్ +అమ్ము = కఱకుటమ్ము

నిగ్గు +అద్దము – నిగ్గు +ట్ +అద్దము =నిగ్గుటద్దము

**సూత్రం -2:** కర్మధారయ సమాసంలో పేర్వాది శబ్దాలకు అచ్చు పరమైనప్పుడు టుగాగమం విభాషగా వస్తుంది .

ఉదా: పేరు+ఉరము- పేరు+ట్ +ఉరము= పేరుటురము

(టుగాగమం రాకపోతే ) = పేరురము

2. "బహుళం" సంధికార్యాన్ని సోదాహరణంగా వివరించండి
లేదా
ఏవైనా నాలుగు వ్యాకరణ పారిభాషిక పదాలను వివరించండి

**నిర్వచనం** బహుళం అంటే చెప్పిన సంధి కార్యం నిత్యం , నిషేధం, వైకల్పికం , అన్యవిధం అనే అన్ని రకాలుగా జరగడం తెలుగుభాషలో అత్వసంధి దీనికి మంచి ఉదాహరణ ఈ సంధి కార్యాన్ని కింది విధంగా వివరించవచ్చు.

**1. నిత్యం :** వ్యాకరణ కార్యం తప్పకుండా జరిగితే దానిని నిత్యం అంటారు

**ఉదా:** సీత+అమ్మ =సీతమ్మ

రామ+అయ్య =రామయ్య

**2. నిషేధం** కొన్ని చోట్ల సంధికార్యం జరిగితే అర్థ భంగం కలుగుతుంది అలాంటి చోట్ల సంధి చెయ్యరాని పరిస్థితిని నిషేధంఅనిఅంటారు

**ఉదా:** అమ్మ +ఇచ్చెను =అమ్మ యిచ్చెను

**3. వైకల్పికం లేదా విభాష:** వ్యాకరణ కార్యం జరగడానికి, జరగక పోవడానికీ రెండు విధాలుగా అవకాశం ఉంటే దానిని వైకల్పికం లేదా విభాష అనిఅంటారు

**ఉదా:** మేన+అల్లుడు = మేనల్లుడు , మేనయల్లుడు

**4. అన్యవిధం :** సంధి కార్యం వ్యాకరణ సూత్రాలకు లోబడకుండా స్వేచ్ఛగా జరగడాన్ని అన్యవిధం అంటారు

**ఉదా:** ఒక+ఒక=ఒకానొక

**II. వ్యాసరూప సమాధానప్రశ్నలు :**

**1. ఏవైనా రెండు ఆగమసంధులను ఉదాహరణలక్షణాలతో వివరించండి**

లేదా

**నిర్వచనం** సంధిగత పదాల మధ్య ఒక అక్షరం మిత్రునిలాగా వచ్చి చేరడాన్ని ఆగమం అంటారు తెలుగులో రుగాగమసంధి టుగాగమసంధి వీటికి ఉదాహరణలు వీటిని కింది విధంగా వివ రించవచ్చు.

## రుగాగమసంధి

**సూత్రం -1:** కర్మధారయ సమాసంలో పేదాది శబ్దాలకు " ఆలు శబ్దం పరమైనప్పుడు రుగాగమంవస్తుంది .

**వివరణ** పేదాదులు అంటే పేద, బీద, ముద్ద , జవ మనుమమొదలైన అచ్చతెనుగు పదాలు వీటికి " ఆలు అనే శబ్దం పరమైతే వాటి మధ్య "ర్ " అనే అక్షరం అదనంగావచ్చి చేరు తుందనిఅర్థం .

ఉదా: పేద+ఆలు- పేద+ర్ +ఆలు=పేదరాలు

బీద+ఆలు- బీద+ర్ +ఆలు=బీదరాలు

ముద్ద +ఆలు- ముద్ద +ర్ +ఆలు=ముద్దరాలు

జవ+ఆలు- జవ+ర్ +ఆలు=జవరాలు

మనుమ+ఆలు- మనుమ+ర్ +ఆలు=మనుమరాలు

**సూత్రం -2:** కర్మధారయ సమాసంలో తత్సమ శబ్దాలకు "ఆలు" శబ్దం పరమైనప్పుడు అత్వానికి ఉత్వం, రుగాగమం వస్తాయి .

**వివరణ:** తత్సమాలు అంటే తెలుగు పదాలుగా మారబోతున్న ధీర, వీర, గుణవంత, బలవంత మొదలైన సంస్కృతపదాలు వీటికి "ఆలు" అనే శబ్దం పరమైతే వాటి మధ్య మొదట "ఉ" వచ్చి , ఆపై మామూలుగా "ర్ " అనే అక్షరం అదనంగా వచ్చి చేరుతుందని అర్థం .

ఉదా: ధీర+ఆలు- ధీర+ఉ+ర్ +ఆలు=ధీరురాలు

వీర+ఆలు- వీర+ఉ+ర్ +ఆలు=వీరురాలు

గుణవంత+ఆలు- గుణవంత+ఉ+ర్ +ఆలు= గుణవంతురాలు

బలవంత+ఆలు- బలవంత+ఉ+ర్ +ఆలు= బలవంతురాలు

**టుగాగమసంధి**

**సూత్రం -1:** కర్మధారయ సమాసంలో ఉత్వానికి అచ్చు పరమైన ప్పుడు టుగాగమం వస్తుంది .

**వివరణ:** కర్మధారయ సమాసంలో మొదటి పదం చివరి ఉత్వానికి ఏదైనా అచ్చు పరమైతే వాటి మధ్య "ట్ " అనే అక్షరం అదనంగా వచ్చి చేరుతుందని అర్థం .

ఉదా: కఱకు+అమ్ము - కఱకు+ట్ +అమ్ము = కఱకుటమ్ము

నిగ్గు +అద్దము - నిగ్గు +ట్ +అద్దము =నిగ్గుటద్దము

ముద్దు +ఉంగరము- ముద్దు +ట్ +ఉంగరము= ముద్దుటుంగరము

**సూత్రం -2:** కర్మధారయ సమాసంలో పేర్వాది శబ్దాలకు అచ్చు పరమైనప్పుడు టుగాగమం విభాషగా వస్తుంది .

**వివరణ:** కర్మధారయ సమాసంలో పేరు, చిగురు మొదలైన పదాలకు ఏదైనా అచ్చు పరమైతే వాటి మధ్య "ట్ " అనే అక్షరం ఒకసారి రావడం, ఇంకోసారి రాకపోవడం జరుగుతుందని అర్థం .

ఉదా: పేరు+ఉరము- పేరు+ట్ +ఉరము= పేరుటురము

(టుగాగమం రాకపోతే ) = పేరురము

చిగురు+ఆకు- చిగురు+ట్ +ఆకు=చిగురుటాకు
(టుగాగమంరాకపోతే ) =చిగురాకు

2. ఏవైనా నాలుగు ఆదేశ సంధులను వివరించండి
లేదా

**నిర్వచనం** సంధిగత పదాలలో ఒక అక్షరాన్ని తొలగించి దాని స్థానంలో మరో అక్షరం వచ్చి చేరడాన్ని ఆదేశం అని అంటారు ఆదేశాక్షరాలు వచ్చే సంధులను ఆదేశసంధులని అంటారు మన పాఠ్యప్రణాళికలో ఇచ్చిన సవర్ణదీర్ఘ , గుణ, యణాదేశ , వృద్ధి సంధులు నాలుగు సంస్కృతసంధులు ఆదేశ సంధులే వాటిని కింది విధంగా వివరించవచ్చు.

**1. సవర్ణదీర్ఘసంధి :**

**సూత్రం :** అఇఉఋ లకు సవర్ణాలు పరమైతే వాటి దీర్ఘం ఏకాదేశం అవుతుంది

**వివరణ** సవర్ణం అంటే సజాతి వర్ణం అనగా అదే వర్ణం అని అర్థం . అనగా" అఆ" లకు వాటి సవర్ణాలైన " అ" కాని " ఆ" కాని పరమైతే వాటి దీర్ఘమైన " ఆ" వస్తుందని అర్థం . ఇలాగే మిగిలిన వాటికీ వస్తాయి .

**"అ"కు సంబంధించిన పదాలు**

రామ+అనుజుడు=రా మా నుజుడు (అ+అ=ఆ)
రామ+ఆలయము=రా మా లయము (అ+ఆ=ఆ)
మహా +అనుభావుడు=మహా నుభావుడు (ఆ+అ=ఆ)
మహా +ఆగ్రహం =మహా గ్రహం (ఆ+ఆ=ఆ)

**"ఇ"కి సంబంధించిన పదాలు**

కవి+ఇంద్రుడు=కవీంద్రుడు (ఇ+ఇ=ఈ)
కవి+ఈశ్వరుడు =కవీశ్వరుడు (ఇ+ఈ=ఈ)

**"ఉ"కు సంబంధించిన పదాలు**

ప్రభు +ఉత్తముడు =ప్ర భూత్తముడు (ఉ+ఉ=ఊ)
ధేను +ఊధస్యము =ధే నూధస్యము (ఉ+ఊ=ఊ)

**“ఋ” కు సంబంధించిన పదాలు**

మాతృ + ఋణము = మాతౄణము (ఋ + ఋ = ౠ)

**2. గుణసంధి**

**సూత్రం :** అకారానికి “ఇ,ఉ,ఋ” లు పరమైతే క్రమంగా “ఏ,ఓ,అర్ ” లు ఏకాదేశం అవుతాయి.

**వివరణ:** అకారానికి “ఇ,ఈ” లు పరమైతే “ఏ” వస్తుందని ; “ఉ,ఊ” లు పరమైతే “ఓ” వస్తుందని ; “ఋ” పరమైతే “అర్ ” వస్తుందని అర్థం .

**ఉదా:** దేవ + ఇంద్రుడు = దేవేంద్రుడు (అ + ఇ = ఏ)

రమా + ఈశ్వరుడు = రమేశ్వరుడు (అ + ఈ = ఏ)

దానవ + ఉత్తముడు = దానవోత్తముడు (అ + ఉ = ఓ)

నవ + ఊహ = నవోహ (అ + ఊ = ఓ)

రాజ + ఋషి = రాజర్షి (అ + ఋ = అర్ )

**3. యణాదేశసంధి**

**సూత్రం :** “ఇ,ఉ,ఋ” లకు అసవర్ణాలైన అచ్చులు పరమైతే క్రమంగా “య,వ,ర” లు ఏకాదేశం అవుతాయి.

**వివరణ:** అసవర్ణాలు అనగా విజాతి వర్ణాలు . “ఇ” కి అసవర్ణం (అ,ఆ,ఉ,ఊ,ఋ) పరమైతే “య్ ” వస్తుందని , “ఉ” కు అసవర్ణం (అ,ఆ,ఇ,ఈ,ఋ) పరమైతే “వ్ ” వస్తుందని ; “ఋ” కు అసవర్ణం (అ,ఆ,ఇ,ఈ,ఉ,ఊ) పరమైతే “ర్ ” వస్తుందని అర్థం .

**“ఇ” కి సంబంధించిన పదాలు**

అతి + అంతము = అత్యంతము (ఇ + అ = య్ )

అతి + ఆదరము = అత్యాదరము (ఇ + ఆ = య్ )

అతి + ఉష్ణము = అత్యుష్ణము (ఇ + ఉ = య్ )

అతి + ఊనము = అత్యూనము (ఇ + ఊ = ఊ)

**“ఉ” కు సంబంధించిన పదాలు**

మను + అంతరము = మన్వంతరము (ఉ + అ = వ్ )

అణు + ఆయుధం = అణ్వాయుధం (ఉ + ఆ = వ్ )

మను + ఇచ్ఛ = మన్విచ్ఛ (ఉ + ఇ = వ్ )

మను+ఈహ=మన్వీహ (ఉ+ఈ=వ్ )

**"ఋకుసంబంధించినఉదాలు**

పితృ+అంశ=పిత్రంశ (ఋ+అ=ర్ )

పితృ+ఆర్జితము =పిత్రార్జితము (ఋ+ఆ=ర్ )

మాతృ+ఇచ్ఛ=మాత్రిచ్ఛ (ఋ+ఇ=ర్ )

మాతృ+ఈష=మాత్రీష (ఋ+ఈ=ర్ )

**4. వృద్ధిసంధి :**

**సూత్రం :** అకారానికి "ఏఐ" లుపరమైతే "ఐకారం" "ఓఔ" లుపరమైతే "ఔకారం" ఏకాదేశం అవుతాయి.

**ఉదా:** ఏక+ఏక=ఏకైక (అ+ఏ=ఐ)

మహా +ఐశ్వర్యము =మహైశ్వర్యము (ఆ+ఐ=ఐ)

దివ్య +ఓషధి=దివ్యౌషధి (అ+ఓ=ఔ)

దేశ +ఔన్నత్యము =దేశౌన్నత్యము (అ+ఔ=ఔ)

# సమాసాలు

1. తత్పురుష సమాసాలనుపేర్కొనండి .

**నిర్వచనం** సమసించవలసినరెండు పదాలలో ఉత్తర పదయొక్క అర్థం ప్రధానమైనది తత్పురుష సమాసం ఇవి విభక్తి ప్రత్యయాలు లోపించడంద్వారా ఏర్పడతాయి . అందుకే వీటికి లోపించే విభక్తి ప్రత్యయాలను బట్టి పేర్లు పెట్టారు . వీటిని కింది విధంగా వివరించవచ్చు.

**1. ప్రథమాతత్పురుషసమాసం** ప్రథమా విభక్తి ప్రత్యయాలు లోపించడంద్వారా ఏర్పడేది ప్రథమాతత్పురుషసమాసం .

**ఉదా:** పూర్వకాలము -కాలముయొక్క పూర్వము

**2. ద్వితీయాతత్పురుష సమాసం** ద్వితీయా విభక్తి ప్రత్యయాలు లోపించడం ద్వారా ఏర్పడేది ద్వితీయాతత్పురుషసమాసం .

**ఉదా**: నెల+తాలుపు= నెలతాల్పు -నెలనుతాల్చినవాడు

**3. తృతీయాతత్పురుషసమాసం** తృతీయా విభక్తి ప్రత్యయాలు లోపించడంద్వారా ఏర్పడేది తృతీయాతత్పురుషసమాసం

**ఉదా:** గుణాధికము=గుణముచేతఅధికము

**4. చతుర్థీతత్పురుషసమాసం** చతుర్థీ విభక్తి ప్రత్యయాలు లోపించడంద్వారా ఏర్పడేది చతుర్థీతత్పురుషసమాసం .

**ఉదా:** దేవరమేలు=దేవర కొరకు మేలు

**5. పంచమీతత్పురుషసమాసం** పంచమీ విభక్తి ప్రత్యయాలు లోపించడంద్వారా ఏర్పడేది పంచమీతత్పురుషసమాసం

**ఉదా:** దొంగభయము=దొంగ వలనభయము

**6. షష్ఠీతత్పురుషసమాసం** షష్ఠీ **విభక్తి** ప్రత్యయాలు లోపించడంద్వారా ఏర్పడేది **షష్ఠీ** తత్పురుషసమాసం

**ఉదా:** రామబాణము=రాముని యొక్క బాణము

**7. సప్తమీతత్పురుషసమాసం** సప్తమీ విభక్తి ప్రత్యయాలు లోపించడంద్వారా ఏర్పడేది **సప్తమీ** తత్పురుషసమాసం

**ఉదా:** మాటనేర్పరి =మాటయందునేర్పరి

2. కర్మధారయ సమాసాలనుసోదాహరణంగా తెలపండి. లేదా

**పరిచయము** సమాసాలు తత్పురుషం, బహువ్రీహి , ద్వంద్వం , అని మూడురకాలు. సమసించవలసినరెండు పదాలలో ఉత్తర పదయొక్క అర్థం ప్రధానమైనది తత్పురుష సమాసం ఈ తత్పురుష సమాసం రెండు రకాలు. 1. వ్యధికరణము 2. సమానాధికరణము సమానాధికరణానికి కర్మధారయము అని పేరు. తత్పురుష సమాసంలో నామవాచకం సర్వనామాలు సాధారణంగా విశేష్యాలుగా ఉంటాయి. వాటి గుణాలనుతెలియ జేసే పదాలను విశేషణాలని అంటారు ఇలా విశేషణ , విశేష్యాల తోను ; ఉపమాన ఉపమేయాలతోను ఏర్పడే సమాసాలనుకర్మధారయ సమాసాలుఅని అంటారు వాటిని కింది విధంగా వివరించవచ్చు.

**1. విశేషణపూర్వపదకర్మధారయసమాసం** పూర్వపదం విశేషణంగాను, ఉత్తరపదం విశేష్యంగాను ఉండేది విశేషణపూర్వపద కర్మధారయసమాసం .

**ఉదా:** తెల్లావు – తెల్లనైన ఆవు,

తీపిమాట – తియ్యనైన మాట

**2. విశేషణోత్తరపదకర్మధారయసమాసం :** పూర్వపదం విశేష్యం గాను ఉత్తరపదం విశేషణంగాను, ఉండేది విశేషణ ఉత్తర పద కర్మధారయసమాసం .

**ఉదా:** తమ్ముగుర్ర – కుర్రవాడైన తమ్ముడు

కపోతవృద్ధము – వృద్ధమైన కపోతము

**3. విశేషణోభయపదకర్మధారయ సమాసం** పూర్వ , ఉత్తర పదాలు రెండూ విశేషణాలుగా ఉండేది విశేషణ ఉత్తరపద కర్మ ధారయ సమాసం

**ఉదా:** శీతోష్ణము – శీతము, ఉష్ణము అయినది

మృధుమధురము మృధువు మధురము అయినది

**4. ఉపమానపూర్వపదకర్మధారయసమాసం** పూర్వపదం ఉప మానంగాను, ఉత్తరపదం ఉపమేయంగాను ఉండేది ఉపమాన పూర్వపద కర్మధారయసమాసం .

**ఉదా:** తేనెమాట – తేనె లాంటి మాట

జుంటిమోవి – జున్ను లాంటి మోవి

**5. ఉపమానోత్తరపదకర్మధారయసమాసం** పూర్వపదం ఉప మేయంగాను, ఉత్తరపదం ఉపమానంగాను ఉండేది ఉపమాన పూర్వపద కర్మధారయసమాసం .

**ఉదా:** ముఖపద్మము – పద్మము లాంటి ముఖము

ముఖారవిందము అరవిందము లాంటి ముఖము

**6. అవధారణాపూర్వపదకర్మధారయసమాసం** ఉపమేయఉపమానాలకు అభేదంచెప్పడం . దీనినే రూపకసమాసం అనిఅంటారు

**ఉదా:** విద్యాగంధం – విద్య అనే గంధం

కోపాగ్ని - కోపం అనే అగ్ని

********

ఆ కొరుకు వడని ప్రశ్న కోరి చదువవచ్చు
వదలరాదు దాని పదను చూసి
తెమలి నమలలేక తిండి మరతురయ్యా?
బాలలార! భావిపౌరులార!

- భావిపౌరశతకము

by కవితశ్రీ

(శుభం)